


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 04.11.2025 | సంపుటి : 2 | సంచిక :270 | పేజీలు : 8 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI | Thuesday | 04.11.2025 | volume : 2 | Issue : 270 | Pages : 8 | Cost : 2/-



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




### మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం: పొన్నం

చేవెళ్ల: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై విచారణకు ఆదేశించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారం ప్రకటించినట్లు వెల్లడించారు. చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. 'ఈ బస్సు ప్రమాదంలో 19 మంది చనిపోయారు. మృతదేహాలకు పోస్టుమార్టం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతోంది. మృతుల్లో పది మంది మహిళలు, 8 మంది పురుషులు, ఒక చిన్నారి ఉన్నారు.



# రహదారిపై మృత్యుకేళి



ప్రమాద సమయంలో ప్రయాణికుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం హృదయ విదారకంగా మారింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మూడు జేసీబీల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. కంకరలో కూరుకుపోయిన వారిని బయటకు తీసారు. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## చేవెళ్ల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### ఆర్టీసి బస్సును ఢీకొన్న కంకర టిప్పర్

### ప్రమాదంలో 19 మంది మృతి

పులువురికి తీవ్ర గాయాలు.. మృతుల సంఖ్య పెరిగే అవకాశం

రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తాండూరు డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సును కంకర లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. చేవెళ్ల మండలం మిర్జాగూడ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 19 మంది మృతి చెందగా.. 20 మంది తీవ్రంగా గాయడ్డారు. బస్సుపై కంకర లోడు పడిపోవడంతో పలువురు ప్రయాణికులు దానికింద కూరుకుపోయారు. మృతుల్లో 13 మంది మహిళలు, 5 మంది పురుషులు, ఒక చిన్నారి ఉన్నారు.

రంగారెడ్డి, నవంబర్ 3 : మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. 14 మృతదేహాలకు చేవెళ్ల ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం పూర్తయినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. క్షతగాత్రుల్లో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు. టీఎస్ 34 టీఏ 6354 నంబరు గల ఆర్టీసీ బస్సు తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తాండూరులో ఉదయం 4.40 గంటలకు బస్సు బయల్దేరింది. అక్కడ 30 మందికి పైగా ఉద్యోగులు, కళాశాలలకు వెళ్లే ఉద్యోగులు

- మిగతా 2 లో..



## రాష్ట్రపతి, ప్రధాని మోడీ సంతాపం

### మృతుల కుటుంబాలకు 2లక్షల సాయం ప్రకటన

న్యూఢిల్లీ, నవంబరు 3 : తెలంగాణలోని చేవెళ్లలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగ్రాతులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి

- మిగతా 2 లో..

# ఎస్ఎల్‌బీసీ పడావు వెనుక రాజకీయ దురుద్దేశం

- పదేళ్లలో పనులు చేయలేకపోయిన కెసిఆర్
- కమిషన్లు రావనే ప్రాజెక్టుపై అశ్రద్ధ
- ఇప్పుడేమో హరీష్ రావు అవాకులుచవాకులు
- ఎట్టి పరిస్థితుల్లోనూ టన్నెల్ పనులు పూర్తి చేస్తాం
- టన్నెల్ నిర్మాణపనులపై సిఎం రేవంత్ పరిశీలన

నాగర్‌కర్నూల్, నవంబర్ 3 : రాజకీయ దురుద్దేశంతోనే కేసీఆర్ హయాంలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు ను పక్కకు పెట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తప్పులు చేసి.. అప్పులు చేసి దోపిడీ చేశారనే కారణంతోనే ప్రజలు బీఆర్ఎస్‌ని పక్కన బెట్టారని

- మిగతా 2 లో..



## ప్రమాద ఘటనపై సిఎం రేవంత్ దిగ్భ్రాంతి

### తక్షణ సహాయక చర్యలకు ఆదేశం

రంగారెడ్డి, నవంబర్ 3 : చేవెళ్ల మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం

- మిగతా 2 లో..



## అతివేగం కూడా ప్రమాదాలకు కారణం అవుతోంది

- అతివేగం కూడా ప్రమాదాలకు కారణం అవుతోంది
- స్పీడ్ కంట్రోల్ అమలుపై దృష్టి సారించాలి
- అధికారులతో సమీక్షించిన మత్రి పొన్నం

హైదరాబాద్,నవంబరు3 : చేవెళ్ల వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో రెండు వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉన్నప్పటికీ.. ఇరుకు రోడ్డు, డివైడర్ లేకపోవడం ప్రమాదానికి ఒక కారణంగా తోస్తున్నదని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రమాద. తీవ్రత కూడా అధికంగా ఉందన్నారు. అలాగే వాహనాల స్పీడ్

- మిగతా 2 లో..

## పత్తిరైతుల పరిస్థితి ఘోరం

### తేమ పేరుతో మోసం చేస్తున్నారు.. జిల్లా పర్యటనలో కవిత విమర్శలు



ఆదిలాబాద్, నవంబర్ 3 : రాష్ట్రంలో పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని.. తేమ పేరిట రైతులను మోసం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. వేరే దిక్కు లేక రైతులు ప్రైవేటుకు అమ్ముకుంటున్నారని చెప్పారు. తెలంగాణ జాగృతిబాటలో భాగంగా ఆమె జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ..ఇక్కడ బీజేపీ

- మిగతా 2 లో..



## చైనాకు ట్రంప్ వార్నింగ్

- తైవాన్‌పై దాడి చేస్తే పరిణామాలు తీవ్రం
- హెచ్చరికలు చేసిన అమెరికా అధ్యక్షుడు

06

## పత్తి కొనుగోళ్లలతో సిసిఐ నిబంధనలు మార్చాలి

### కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరావు లేఖ

హైదరాబాద్, నవంబర్ 3 : పత్తి కొనుగోళ్లలో సీసీఐ విధించిన నిబంధనలు మార్చాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయాలన్న సీసీఐ కొత్త నిబంధన నేపథ్యంలో కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తాకు లేఖ రాశారు. సాధారణంగా ఇప్పటి వరకు ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తుండగా.. ఎకరాకు 11.74 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ల నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం

- మిగతా 2 లో..





# రాజకీయ దురుద్దేశంతోనే ఎస్ఎల్బిసి పడావు

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయకపోతే తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ నేతలని క్షమించరని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఎస్ఎల్బీసీ టన్నెల్ని తమ ప్రభుత్వంలో పూర్తి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఎల్బీసీ విషయంలో తమ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చిల్లర మాటలు మానుకోవాలని హితవు పలికారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రాంతంలో సీఎం రేవంత్‌రెడ్డి జియో ఫిజికల్ సర్వే నిర్వహించారు. ఎస్ఎల్బీసీ టన్నెల్‌ను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు 1983లో మంజూరైందని, ఇప్పటికీ పూర్తికాకపోవడం బాధాకరమని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా మన్నేవారిపల్లెలో పర్యటించిన సీఎం.. హెలీ మ్యాగ్నటిక్ సర్వేకు సిద్ధంగా ఉన్న సర్వే హెలికాప్టర్, అధునాతన పరికరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. టన్నెల్ బోర్ మిషన్‌తో పనులు చేయడం కష్టంగా మారిందని, పనులపై భారత రాష్ట్ర సమితి నాయకులు రాజకీయం చేయడం తగదని అన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా.. టన్నెల్ పనులు పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. ప్రాజెక్టు మంజూరు చేసేనప్పుడు టన్నెల్ పనుల అంచనా విలువ రూ.1,968 కోట్లు. రెండు దశాబ్దాలుగా సాగుతున్న టన్నెల్ పనుల్లో ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడేనాటికి 30 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణం పూర్తయింది. కేసీఆర్ ప్రభుత్వ పదేళ్లలో మిగతా 10కి.మీ టన్నెల్ పూర్తి చేయలేదు. పెద్దగా కమీషన్లు రావని ఈ ప్రాజెక్టును పక్కకు పెట్టారు. ఏపీలో జగన్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడును విస్తరిస్తుంటే కేసీఆర్ చూస్తూ ఊరుకున్నారు. రూ.2 వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే ఉమ్మడి నల్గొండ జిల్లాలకు నీరు అందేది. ఈ ప్రాజెక్టు పూర్తయితే.. కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందనే దురుద్దేశంతో పట్టించుకోలేదు. కృష్ణా నది మీద చేపట్టిన అన్ని ప్రాజెక్టులను కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. గత పదేళ్లలో సాగునీటి ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు కేసీఆర్ ప్రభుత్వం రూ.1.86 లక్షల కోట్లు చెల్లించింది. ఆ మొత్తంలో కాళేశ్వరం కాంట్రాక్టర్‌కే రూ.1.06 లక్షల కోట్లు చెల్లించారు. గత పదేళ్లలో ఏపీ ప్రభుత్వం కృష్ణా నదిపై ఎన్నో ప్రాజెక్టులు చేపట్టి పూర్తి చేసింది. తెలంగాణలో మాత్రం కేసీఆర్ ప్రభుత్వం కృష్ణానదిపై ప్రాజెక్టులు పూర్తి చేయలేదని రేవంత్‌రెడ్డి అన్నారు.గత పదేళ్లలో ఏ ప్రాజెక్టునూ కేసీఆర్ పూర్తి చేయలేదని మండిపడ్డారు. ఇప్పుడు ఆయా ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరం చెబుతోందని పేర్కొన్నారు. కేసీఆర్ నిర్వాకం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు అలుసైపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉండి ఉంటే టన్నెల్ పనులు ఎప్పుడో పూర్తయ్యేవని చెప్పుకొచ్చారు. ఎస్ఎల్బీసీని గత కేసీఆర్ ప్రభుత్వం గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. కమిషన్లు రావని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎస్ఎల్బీసీని పట్టించుకోలేదని ఫైర్ అయ్యారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 10 కిలోమీటర్లు కూడా టన్నెల్ పనులు పూర్తికాలేదని చెప్పుకొచ్చారు. టన్నెల్ పూర్తి చేస్తే కాంగ్రెస్‌కు పేరొస్తుందనే కారణంతోనే గాలికొదిలేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 టీఎంసీల తరలింపు, 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 1983లో ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు మంజూరైందని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2004లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎస్ఎల్బీసీ టన్నెల్-1, టన్నెల్-2 పనులను ప్రారంభించారని చెప్పుకొచ్చారు. రూ.1968 కోట్లతో టెండర్లు పిలిచారని గుర్తుచేశారు. ఈ దేశంలోనే తొలిసారిగా ఎస్ఎల్బీసీ టన్నెల్‌కు టన్నెల్ బోర్ మిషన్‌ని ఉపయోగించారని వివరించారు. 2014 వరకు కిలోమీటరు వరకు టన్నెల్ పనులు పూర్తి అయ్యాయని తెలిపారు.

## పదేళ్లలో పనులు చేయలేకపోయిన కెసిఆర్

కేసీఆర్ హయాంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయకపోవడమే కాదని.. కృష్ణా నదిపై ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ పదేళ్లలో రూ.1.86 లక్షల కోట్లు కాంట్రాక్టర్లకు ఇచ్చారని ఫైర్ అయ్యారు. అందులో రూ.1.5 లక్షల కోట్లు కాళేశ్వరం కోసమే ఖర్చు చేశారని మండిపడ్డారు. కృష్ణాలో తెలంగాణ వాటాని మనం తీసుకోకపోవడం వల్ల ఆ నీటిని ఆంధ్రప్రదేశ్ తరలించుకుపోతోందని చెప్పుకొచ్చారు. 299 టీఎంసీలు చాలని ఆనాడు హరీశ్‌రావు సంతకం పెట్టి వచ్చారని ధ్వజమెత్తారు. తెలంగాణ వాటా మనకు దక్కాల్సిందేనని ట్రిబ్యునల్‌లో ఈ విషయంపై తాము వాదనలు వినిపిస్తూ ఒక కొలిక్కి తీసుకొస్తున్నామని వివరించారు. ఇంత తక్కువ ఖర్చుతో 30 టీఎంసీల నీటిని తీసుకెళ్లే ప్రాజెక్టు దేశంలో ఎక్కడా లేదని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు పనులు మొదలు పెట్టామని తెలిపారు. అయితే, ఈ పనుల నేపథ్యంలో దురదృష్టవశాత్తూ 8 మంది కార్మికులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు బాధ ఉన్నా.. ఆ కుటుంబాలను ఆదుకుని పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆర్మీలో ఉన్న పరిచయాలతో ఎస్ఎల్బీసీ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ముంపునకు గురవుతున్న మర్లపాడు, కేశ్యతండా, నక్కలగండి తండా ప్రజలను ఆదుకుని, డిసెంబర్ 31వ తేదీలోగా సమస్యలని పరిష్కరిస్తామని మాటిచ్చారు. ఇప్పుడు కాకపోతే ఈ ప్రాజెక్టును ఇంకెప్పుడూ పూర్తి చేసుకోలేమని చెప్పుకొచ్చారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా పరిష్కరించి ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేసుకోకపోతే నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల ప్రజలకు తీరని నష్టం కలుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# పత్తి కొనుగోళ్లలతో సిసిఐ నిబంధనలు మార్చాలి

(మొదటిపేజీ తరువాయి)

డిక్లరేషన్ ఇచ్చిందని ఆ లేఖలో ప్రస్తావించారు. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పత్తి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో సీసీఐ తీసుకొచ్చిన కొత్త నిబంధన పత్తి రైతులకు నష్టం చేసేలా ఉంది. తేమ శాతం విషయంలో 20శాతం వరకు ఉన్నా సరే పత్తి పంట సీసీఐ కొనుగోలు చేయాలి. కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన లేకపోవడం వల్ల కూడా పత్తి రైతులకు ఇబ్బందులు తలెత్తాయి. రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని 7 క్వింటాళ్ల నిబంధన ఎత్తి వేసి పాత పద్ధతిలో పత్తి కొనుగోళ్లు చేయాలి. జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని మంత్రి తుమ్మల కేంద్రానికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

# దయనీయంగా పత్తి రైతుల పరిస్థితి

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యే, ఎంపీలు ఉండి కూడా రైతులకు ప్రయోజనం లేకుండా పోయిందని ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్రచారం ఆపేసి రైతుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. తేమతో సంబంధం లేకుండా గిట్టుబాటు ధరకు సీసీఐ పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కవిత జాగృతి జనం బాట కార్యక్రమం ఆదిలాబాద్‌కు చేరుకుంది. షెడ్యూల్ ప్రకారం ఇవాళ ఆమె ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈ మేరకు కవితకు సంప్రదాయ వాయిద్యాలు, గుస్సాడీ నృత్యాలతో ఆదివాసీలు, తెలంగాణ జాగృతి నాయకులు ఘన స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలో ఆదివాసీల ఆరాధ్య దైవం కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె ఆదివాసీల, రైతుల సమస్యలపై మాట్లాడారు.

# దూసుకొచ్చిన మృత్యు శకటం

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కారు. మొత్తంపై బస్సులో సుమారు 72 మంది ప్రయాణికులు ఉన్నారు. విద్యార్థులు హైదరాబాద్‌లోని పలు కళాశాలల్లో చదువుతున్నట్లు సమాచారం. ఆదివారం సెలవు కావడంతో ఇళ్లకు వెళ్లి.. తిరిగి నగరానికి వస్తుండగా ఈ ఘటన జరిగింది. రోడ్డు ప్రమాదంతో హైదరాబాద్-బీజాపూర్ హైవేపై భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. ఈ ఘటనతో చేవెళ్ల-వికారాబాద్ మార్గంలో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 15 మంది ప్రయాణికులతో పాటు బస్సు కండక్టర్ రాధను పోలీసులు రక్షించారు. కండక్టర్‌కు గాయాలు కావడంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. సహాయక చర్యలు జరుగుతున్న సమయంలో చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్‌పైకి జేసీబీ ఎక్కడంతో ఆయన ఎడమ కాలికి గాయమైంది. సీఐను చేవెళ్ల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీ కొనడంతో బస్సులోకి టిప్పర్ దూసుకెళ్ళింది. ఈ ప్రమాదంజరిగినప్పుడు బస్సులో 70 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరగటంతో సీట్లలోనే వీరు ఇరుక్కుపోయారు. టిప్పర్ లోని కంకర బస్సులో పడడంతో ముందు వరుసలో ఉన్న 5 సీట్లు డ్యామేజ్ అయ్యాయి. అయితే ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఇప్పటికే ఈ ప్రమాదంలో బస్సులో ఇరుక్కుపోయి.. గాయపడిన 15 మందిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గురైన బస్సు తాండూరు నుండి హైదరాబాద్ వెళ్తుండగా చేవెళ్ల మండలం మిర్జాగూడ దగ్గర రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో చేవెళ్ల-వికారాబాద్ మార్గంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇటీవల జరిగిన కర్నూల్ బస్సు ప్రమాదంలో 19 మంది సజీవ దహనం అయిన ఘటన మరువకముందే.. ఈ ఘటన జరగడం రాష్ట్రంలో విషాదాన్ని నింపింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మిర్జాగూడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద



దృశ్యాలు పలు హృదయాలను కలిచివేస్తున్నాయి. వాహనాలు వేగంగా ఒకదానికొకటి ఢీ కొనడంతో మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 20 మంది మృతి చెందారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో బస్సు, లారీ డ్రైవర్లు సహా 10 మంది పురుషులు, 9 మంది మహిళలు, ఒక చిన్నారి ఉన్నారు. ఘటన సమయంలో ప్రయాణికుల ఆర్తనాదాలు చేయడం గుండెను పిండేసేవిగా ఉన్నాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మూడు జేసీబీల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు.







# చేవెళ్ల ప్రమాదంలో ఇరుకు రోడ్డు కూడా ఓ కారణం

(మొదటిపేజీ తరువాయి)

లాక్ ఎంతవరకు అమలవుతుందో చూడాలని అధికారులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో బస్సు దుర్ఘటన నేపథ్యంలో తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. వరుస ప్రమాదాలు, నివారణా చర్యలపై జూమ్ వేదికగా నిర్వహించిన ఈ కీలక భేటీలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి , జేటీసీలు, డీటీసీలు, ఇతర రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే ట్రిపుల్ పెనాల్టీ వేయాలి. రవాణాశాఖ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీరియస్‌గా, క్రియాశీలంగా ఉండాలి. లారీలు ఇసుక, దస్టును తరలిస్తే.. టార్పాలిన్లు కప్పి ఉంచాలి. రైతులు ధాన్యం తరలింపు వాహనాలపై వేధింపులకు పాల్పడొద్దు. వాణిజ్య, సరుకు రవాణా, ప్రయాణికుల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. ఘటన జరిగినప్పుడే దాడులు చేయడం కాదు.. నిరంతరం కార్యాచరణ ప్రణాళిక ఉండేలా కఠినంగా వ్యవహరించాలి. రవాణాశాఖ పట్ల ప్రజలు, ప్రభుత్వంలో గౌరవం పెంపొందించేలా ఉద్యోగులు పనిచేయాలి. సమర్థంగా పనిచేయండి.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు.

అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ప్రతి జిల్లాలో కఠినంగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చు. డీటీసీ, ఆర్టీవోలు ఇతర రవాణా శాఖ అధికారులు ఒక్కో జిల్లాలో మూడు బృందాలుగా ఏర్పాటు చేసుకొని నిరంతరం పర్యవేక్షించాలి. నిబంధనలు పాటించని స్లీపర్ బస్సులు, అందులో కార్గో సరుకులు తరలిస్తే కఠినంగా వ్యవహరించండి. స్కూల్ బస్ ఫిట్‌నెస్, హైర్ బస్ ఫిట్‌నెస్, ట్రక్కులు, టిప్పర్‌లు, లారీలు.. వాటి ఫిట్‌నెస్ పర్మిట్‌లపై యాక్షన్ ఎలాన్ సిద్ధం చేయాలి. రాబోయే రోడ్డు భద్రతా మాసంలో మరింత అవగాహన కల్పించాలని ఆదేశించారు.

# ప్రమాద ఘటనపై సిఎం రేవంత్ దిగ్భ్రాంతి

(మొదటిపేజీ తరువాయి)

ఘటనపై దిగ్భ్రాంతి చెందారు. అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని, అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలని రేవంత్ రెడ్డి తెలిపారు. బస్సు ప్రమాదంలో గాయపడిన వారందరినీ వెంటనే హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్య చికిత్స అందించేలా ఏర్పాట్లు చేయాలని డీజీపీలను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశిం చారు. అందుబాటులో ఉన్న మంత్రులు వెంటనే ప్రమాద సంఘటనకు చేరుకోవాలని పేర్కొన్నారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సీఎం సూచించారు. ప్రమాదం పై టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చేవెళ్ళలో జరిగిన రోడ్డు ప్రమాదంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గాయపడ్డవారికి తగిన వైద్య చికిత్సలు చేయాలని సూచించారు. అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మృతులకు మహేష్ కుమార్ గౌడ్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

## రాష్ట్రపతి, ప్రధాని మోడీ సంతాపం

(మొదటిపేజీ తరువాయి)

రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రధాని తెలిపారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మిర్జాగూడ సమీపంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో 19 మంది మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

# పేదలపై బుల్‌డోజర్లు అడ్డుకుందాం

- కారు, బుల్డోజర్‌కు మధ్య పోటీ
- జూబ్లీహిల్స్‌లో సునీతను గెలిపించాలి
- రేవంత్ హయాంలో అన్నీ లిటికేషన్లే..
- బోరబండ రోడ్‌షోలో కెటిఆర్ విమర్శలు



**హైదరాబాద్, నవంబరు 3 :** పేదల ఇళ్లపైకి బుల్డోజర్లు రాకూడదంటే సునీతమ్మను గెలిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. కారు, బుల్డోజర్లు మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. బుల్డోజర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ బోరబండలో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. వినాయక నగర్, ఎస్పార్టీ నగర్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా హాజరయ్యారు. కిలోమీటర్‌ల మేర ఇసుకేస్తే రాలనంత మందితో నిండిపోయింద ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. హైడ్రా బాధితుల బాధను చూస్తే ప్రతి ఒక్కరికి కళ్లల్లో నీళ్లు వస్తాయన్నారు. హైడ్రా పేరుతో వేలాది మంది ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చిందని కేటీఆర్ అన్నారు. హైడ్రా అనే రాక్షసి మాయం కావాలంటే ఈ నెల 11న కారు గుర్తుకు ఓటేయాలని సూచించారు. ప్రతి పేద వాడికి మేం అండగా నిలబడతాం.. బుల్డోజర్లకు అడ్డంగా పడుకుంటామని స్పష్టం చేశారు. సునీతమ్మకు అండగా నేనున్నా.. కేసీఆర్ ఉన్నారు.. పక్కనే తెలంగాణ భవన్ ఉందని తెలిపారు. అర్ధరాత్రి ఫోన్ చేసినా అర్ధగంటలో మీ వద్దకు వస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వాళ్లు భయపెడితే.. మేం వచ్చి వాళ్ల సంగతి తేలుస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ తిరిగి ఈ రాష్ట్రానికి నాయకత్వం వహించాలని ప్రజలు కోరుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు. ఒక్కరిని కూడా మోసం చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విడిచిపెట్టలేదని అన్నారు. కాంగ్రెస్ హామీలు ఇచ్చి రెండే÷-ళ్లైంది.. ఇంకా అమలు కావట్లేదని తెలిపారు. స్కూటీలు రాలేదు.. ఇందిరమ్మ ఇల్లు రాలేదు.. రూ.4వేలు పెన్షన్ రాలేదు.. ఏ ఒక్క హామీ అమలు కాలేదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి ఒక్క ఛాన్స్ ఇస్తేనే 160 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. రేవంత్‌కు ఒక్క ఛాన్స్ ఇస్తే పేదల ఇళ్లు కూలగొట్టారు.. మహిళలను మోసం చేశారని.. హైదరాబాద్‌ను బర్బాద్ చేశాడు.. రియల్ ఎస్టేట్‌ను నాశనం చేశారు.. ఫస్ట్ ప్లేస్‌లో ఉన్న తెలంగాణను లాస్ట్ ప్లేస్‌కు దిగజార్చారని అన్నారు. రైతులను, కౌలు రైతులను, రైతు కూలీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కేటీఆర్ అన్నారు. ఢిల్లీకి పంపేందుకు పైసలు ఉన్నాయి కానీ.. పేదలకు ఇచ్చేందుకు మాత్రం పైసలు లేవని విమర్శించారు. రేవంత్ రెడ్డి తన కుర్చీని కాపాడుకునేందుకు రూ.100 కోట్లు రాహుల్ గాంధీకి పంపిస్తున్నారని అన్నారు. తమ వద్ద నిధులు లేవని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారని తెలిపారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి బహిరంగంగా ఈ మాటలు చెప్పారని చెప్పారు. మరో ఎమ్మెల్యే వంద కోట్లు కావాలంటూ ప్రపంచ బ్యాంక్‌కు అప్లికేషన్ పెట్టుకున్నారని తెలిపారు. కంటోన్మెంట్‌లో రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలు చెప్పారన్నారు. ఇప్పటి వరకు ఆ నియోజకవర్గానికి ఒక్క పైసా కూడా విడుదల చేయలేదని మండిపడ్డారు. అక్కడ చేయని అభివృద్ధి.. జూబ్లీహిల్స్ ఎలా చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు రూ.4వేలు ఇస్తామని చెప్పి మాట తప్పారని కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు. నోటిఫికేషన్‌లు లేవు కానీ.. లూటిఫికేషన్ మాత్రం చేస్తున్నారుని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాలు ఇవ్వాలంటున్న నిరుద్యోగులను లాఠీలతో కొడుతున్నారని తెలిపారు. ఆడబిడ్డతో పెట్టుకున్న వాళ్లు ఎవరూ బాగుపడలేదని అన్నారు. మాగంటి గోపీనాథ్ గుర్తుకు వచ్చి సునీతమ్మ ఏడిస్తే.. కాంగ్రెస్ మంత్రులు ఆమెను అవమానించారని మండిపడ్డారు. కన్నీళ్లను కూడా రాజకీయం చేస్తే దౌర్భాగ్యులు ఈ కాంగ్రెస్ నేతలని విమర్శించారు. ఏం చేసేది లేకపోతే.. కుర్చీలో ఎందుకు కూర్చున్నావని ప్రజలు రేవంత్ రెడ్డిని నిలదీస్తున్నారని అన్నారు. హైదరాబాద్ బోరబండలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. వినాయక నగర్, ఎస్పార్టీ నగర్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా హాజరయ్యారు. కిలోమీటర్‌ల మేర ఇసుకేస్తే రాలనంత మందితో నిండిపోయింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బోరబండలో వచ్చిన జనాన్ని చూస్తుంటే గెలుపు పక్కా అని తేలిపోయిందని అన్నారు. మెజార్టీ ఎంత అనేది తేలాల్సి ఉందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఎలా ఉండే తెలంగాణ.. ఇప్పుడు ఎలా అయ్యిందో అందరూ ఆలోచించాలని జూబ్లీహిల్స్ ప్రజలకు కేటీఆర్ సూచించారు. తులం బంగారం ఇస్తామని చెప్పి.. మెడలో ఉన్న గొలుసులు కూడా లాక్కొంటున్నారని మండిపడ్డారు. సర్దార్ కుటుంబాన్ని కూడా ప్రభుత్వం ఇబ్బంది పెట్టిందని.. వాళ్లను పెట్టిన హింసకు సమాధానం చెప్పాల్సిన టైమ్ వచ్చిందని అన్నారు. హిట్లర్ వంటి నియంతలకు కూడా పరాభవం తప్పలేదని.. ఇక రేవంత్ రెడ్డి ఎంత అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు ఓటేయకపోతే జూబ్లీహిల్స్ పథకాలు రద్దు చేస్తామని రేవంత్ బెదిరిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

# ఈ ప్రమాదం యాదృచ్ఛికం మాత్రమే

- రోడ్లు బాగా లేకపోవడం కానేకాదు
- ఎంపి మల్లు రవి కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, నవంబరు 3 :** చేవెళ్ల బస్సు యాక్సిడెంట్‌పై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి సంచలన వ్యాఖ్యలు చేశారు. రోడ్లు బాగోలేకపోవడం వల్లనో.. కాంగ్రెస్ పనిచేయకపోవడం వల్లనో యాక్సిడెంట్ జరగదని తెలిపారు. ఇది రెగ్యులర్‌గా జరిగిన యాక్సిడెంట్ మాత్రమే అని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఓఆర్ఆర్‌పై యాక్సిడెంట్లు జరిగి చనిపోలేదా అని ప్రశ్నించారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మల్లు రవి మాట్లాడుతూ.. చేవెళ్లలో బస్సు యాక్సిడెంట్ జరిగి 19 మంది మరణించడం దురదృష్టకరమని మల్లు రవి అన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రోడ్లు బాగోలేకపోవడం వల్ల, కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేయకపోవడం వల్ల ఈ యాక్సిడెంట్ జరిగిందని అంటున్నారని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఔటర్ రింగ్ రోడ్డు ఎంతో బాగుంది.. అయినా ఓఆర్ఆర్ మీద ఎన్ని యాక్సిడెంట్లు జరిగాయని ప్రశ్నించారు. రోడ్డు మంచిగుందా.. మంచిగ లేదా అని దానివల్ల యాక్సిడెంట్లు జరగవని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో యాక్సిడెంట్లు జరిగి చాలామంది చనిపోయారు.. మా ప్రభుత్వంలోనూ చనిపోయారని అన్నారు. దీన్ని సమర్థించడం లేదని.. జరగకుండా ఉండాలని అనుకుంటానని వివరించారు. కానీ ఈ చావులను రాజకీయాలకు ఉపయోగించవద్దని విజ్ఞప్తి చేశారు. ఇది రెగ్యులర్‌గా జరిగిన యాక్సిడెంట్ మాత్రమే అని స్పష్టం చేశారు. ఎన్ని గారడీ విద్యలు చేసినా, మాయమాటలు చెప్పినా ప్రజలు మోసపోరని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. వాస్తవంగా ఏం జరుగుతుందో దాని ప్రకారమే ఓట్లు వేస్తారని తెలిపారు.

# టిప్పర్ వేగమే కొంపముంచింది

**ఆర్టీసీ బస్సు డ్రైవర్ తప్పిదం లేదు**
**ప్రకటన విడుదల చేసిన తెలంగాణ ఆర్టీసీ**

**హైదరాబాద్, నవంబరు 3 :** చేవెళ్ల బస్సు ప్రమాదం ఘటనపై ఆర్టీసీ అధికారులు వివరణ ఇచ్చారు. బస్సు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ ఆర్టీసీ ప్రకటన విడుదల చేసింది. టిప్పర్ అతివేగమే ప్రమాదానికి కారణమని దర్యాప్తులో తేలిందని చెప్పింది. రోడ్డు మలుపులో అతివేగం వల్ల టిప్పర్ డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడని, ప్రమాదానికి ఆర్టీసీ బస్సు గానీ, బస్ డ్రైవర్ కారణం కాదని స్పష్టం చేసింది. బస్ పూర్తి ఫిట్‌నెస్‌తోనే ఉందని.. డ్రైవర్ సర్వీసు రికార్డులోనూ గతంలో యాక్సిడెంట్లు లేనట్లు తేలిందని చెప్పింది. రోడ్డు మలుపు వద్ద అతి వేగంతో ఉన్న టిప్పర్ డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం ఈ దుర్ఘటన జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పినట్లుగా సంస్థ పేర్కొంది. సోమవారం తెల్లవారు జామున 4.40 గంటల ప్రాంతంలో తాండూరు నుంచి బయలుదేరిన ప్రైవేట్ హైర్ ఎక్స్‌ప్రెస్ బస్‌ను ఇందిరానగర్ సమీపంలో కంకర లోడ్‌తో ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టిన విషయం తెలిసిందే. దాంతో బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. టిప్పర్ లారీ ఢీకొట్టడం బస్‌పై ఒరిగిపోవడంతో అందులో ఉన్న కంకర అంతా బస్‌లో ఉన్న ప్రయాణికులపై పడిపోయింది. దాంతో ఎక్కువ మంది ప్రయాణికులు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో బస్ డ్రైవర్ దస్తగిరి సైతం ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం తర్వాత ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రో షా ఖాన్, ఆపరేషన్స్ ఇన్‌చార్జి ఈడీ శ్రీధర్, రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత, ఇతర సీనియర్ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను ముమ్మరం చేసినట్లు వివరించింది. గాయపడిన 25 మందికి మెరుగైన చికిత్స అందించాలని అధికార బృందం, అక్కడి డాక్టర్లను కోరిందని చెప్పింది. చనిపోయిన 19 మందిలో 5 గురు మహిళలు, 14 మంది పురుషుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించడం జరిగిందని చెప్పింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మృతి చెందిన వారికి ఒక్కొక్కరికి ప్రభుత్వం తరుపున రూ.5 లక్షలు, ఆర్టీసీ నుంచి రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు తెలిపింది. గాయపడిన వారికి రూ.2 లక్షల ఎక్స్రేషియా ప్రభుత్వం ప్రకటించిం దని.. అలాగే, వాహనం ఇన్సురెన్స్ పాలసీ ద్వారా బాధితులకు తగిన మొత్తంలో పరిహారం చెల్లించడం చెప్పింది. ఈ దురదృష్టకర సంఘ టనలో చనిపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ఆర్టీసీ ఆకాంక్షించింది.



## బస్సు ప్రమాద ఘటనపై
# కేసీఆర్ దిగ్భ్రాంతి

**సంతాపం ప్రకటించిన కెటిఆర్, కవిత**



**రంగారెడ్డి, నవంబర్ 3 :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మిర్జాగూడ దగ్గర ఆర్టీసీ బస్సు టిప్పర్ ఢీకొన్న ఘోర ప్రమాదంలో 20 మంది దుర్మరణం పాలైన ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు సంతాపాన్ని ప్రకటించారు. మరణించిన వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవ డంతో పాటు గాయపడిన ప్రయాణికులకు మెరుగైన వైద్య సదుపాయం అందించా లని ప్రభుత్వాన్ని కోరారు. మృతుల కుటుంబాలకు కేసీఆర్ తన ప్రగాఢ సాను భూతిని తెలిపారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఖానాపూర్ స్టేజి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాండూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొన్న ఈ దుర్ఘటనలో 20 మంది ప్రయాణికులు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటం పట్ల ఆయన సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సాయం అందించాలని, మృతుల కుటుంబాలను, గాయపడిన వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చేవెళ్ల ఘోర రోడ్డు ప్రమాదంలో 20 మందికి పైగా మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని తెలిపారు. ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులకు ప్రభుత్వం వెంటనే మెరుగైన వైద్యం అందించాలని.. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.



## ప్రమాద ఘటనపై
# ప్రజల ఆగ్రహం

**ఎమ్మెల్యే కాలె యాదయ్యను నిలదీసిన జనం**

**రంగారెడ్డి, నవంబర్ 3 :** చేవెళ్ల మండలంలో భారీ రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే కాలయ్య సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే ఎమ్మెల్యే కాలె యాదయ్యకు నిరసన సెగ తగిలింది. బస్సు ప్రమాదం జరిగిన చాలా సమయం తరువాత ఎమ్మెల్యే ఘటనా స్థలానికి చేరుకోవడంతో.. ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ పనులు ఎందుకు చేపట్టడం లేదని ఎమ్మెల్యేను నిలదీశారు. అనేకసార్లు రోడ్డు విస్తరణ చేయాలని చెప్పినా నిరక్ష్యం చేశారని స్థానిక ప్రజలు ఆందోళనకు దిగారు. స్థానికులు నిరసన తెలపడంతో ఘటన స్థలం నుంచి ఎమ్మెల్యే కాలె యాదయ్య వెళ్లిపోయారు. ఈ రోడ్డు ప్రమాదం హృదయాలను కలిచివేస్తుంది. బస్సు, టిప్పర్ వేగంగా ఒకదానికొకటి ఢీ కొనడంతో మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 20 మంది మృతి చెందారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో బస్సు, లారీ డ్రైవర్లు సహా 10 మంది పురుషులు, 9 మంది మహిళలు, ఒక చిన్నారి ఉన్నారు. ఘటన సమయంలో ప్రయాణికుల ఆర్తనాదాలు చేయడం గుండెను పిండేసేవిగా ఉన్నాయి. పోలీసులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## బస్సు ప్రమాదంలో
# పోస్ట్‌మార్టమ్ పూర్తి

**బంధువులకు శవాలు అప్పగింత**

**రంగారెడ్డి, నవంబరు 3 :** రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం ఘటనలో మృతులకు శవపరీక్ష పూర్తి చేసి బందువులకు అప్పగించారు. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు, టిప్పర్ డ్రైవర్లతో పాటు 19 మంది మృతిచెందగా.. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో 10 మంది మహిళలు, 8 మంది పురుషులు, ఒక చిన్నారి ఉన్నారు. ఖానాపూర్ గేట్ దగ్గర ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొనడంతోనే ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. మృతుల్లో ఎక్కువగా తాండూరు వాసులు ఉన్నారు. అయితే, చేవెళ్ల ప్రభుత్వాస్పత్రిలో 18 మంది మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి అయింది. తాండూరు, వికారాబాద్, గాంధీ, ఉస్మానియా వైద్యులు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాలు అప్పగించారు. మృతదేహాలని వారి స్వస్థలాలకి పంపించారు. నాగమణి మృతదేహం కర్ణాటకలోని భానూర్‌కు తరలించారు. అనూష, సాయిప్రియ, నందిని, నజీర్ అహ్మద్, విద్యార్థి అఖిల మృతదేహాలని తాండూరుకు పంపించారు. అలాగే, కల్పన, గుణమ్మ మృతదేహాలు హైదరాబాద్ బోరబండకు.. తారిబాయి మృతదేహం గంగారం తండాకు తరలించారు.

## బస్సు ప్రమాదం నుంచి
# బయపడ్డ యువకుడు

**రంగారెడ్డి, నవంబరు 3 :** చేవెళ్ల మండలం మిర్జాగూడ సమీపంలో సోమవారం జరిగిన బస్సు ప్రమాదంలో తాండూరు మండలం గౌతపూర్‌కు చెందిన బాలప్పొల్ల వినయ్ కుమార్(30) అనే యువకుడు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వినయ్‌కుమార్ హైదరాబాద్ సన్ సిటీలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం సెలవుదినం కావడంతో ఇంటికి వెళ్లాడు. సోమవారం విధులకు హాజరయ్యేందుకు ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. డ్రైవర్ వెనుక భాగంలోని ఆరో సీట్లో కూర్చున్నాడు. క్షణాల వ్యవధిలో జరిగిన ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన ఆయన.. అప్రమత్తమై కిటికీలోంచి బయటకు దిగినట్లు చెప్పారు. తన ముందు సీట్లో కూర్చున్న ముగ్గురు అక్కాచెల్లెళ్లు, పక్కన కూర్చున్న మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయినట్లు వివరించాడు. యువకుడు ప్రాణాలతో బయటపడటంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆనందం వ్యక్తం చేశారు.



## నడుములోతు కంకరలో
# కూరుకుపోయిన టీచర్

**హుటాహుటిన నిమ్స్‌కు తరలింపు**

**రంగారెడ్డి, నవంబరు 3 :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ఆర్టీసీ బస్సును కంకర లారీ ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది. కంకర లోడు ఒక్కసారిగా బస్సుపై పడిపోవడంతో పలువురు మృతి చెందారు. మరికొందరు కంకర కింద కూరుకుపోయి తీవ్రగాయాలతో నరకయాతన అనుభవించారు. తోల్కట్టలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మ్యాథ్స్ కాంట్రాక్ట్ టీచర్‌గా పనిచేస్తున్న జయసుధతో పాటు మరికొందరు నడుములోతు కంకరలో ఇరుక్కుని బయటకు రాలేకపోయారు. కేరెల్లి గ్రామానికి చెందిన జయసుధ వికారాబాద్‌లో బస్సు ఎక్కారు. ఆమెతో పాటు మరో నలుగురు ఉపాధ్యాయులూ అదే బస్సులో రావాల్సింది. వారు బయల్దేరడం ఆలస్యం కావడంతో వేరే బస్సులో వచ్చి ప్రమాదం నుంచి బయటపడ్డారు. జయసుధకు కాళ్లు వాచిపోవడంతో కుటుంబసభ్యులు నిమ్స్‌కు తరలించారు.

## చేవెళ్ల ప్రమాదంలో తల్లితో పాటు
# ఏడాది చిన్నారి మృతి



**రంగారెడ్డి, నవంబర్ 3 :** రంగారెడ్డి జిల్లా మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య పెరుగుతోంది. ఏడాది చిన్నారిని మొదలుకొని అరవై ఏళ్ల వయస్సు వారు మృత్యువాత పడ్డారు. ఏడాది వయస్సు ఉన్న చిన్నారి తల్లితోపాటు పాటు రోడ్డు ప్రమాదంలో మృతువాతపడ్డారు. ఈ దృశ్యాలు కంట నీరు పెట్టించింది. తల్లి, బిడ్డ మృతదేహాలను బస్సులో నుంచి బయటకు తీసి రోడ్డుపై ఉంచిన ఫొటో కన్నీరు తెప్పిస్తోంది. ప్రమాద సమయంలో టిప్పర్ మితిమీరిన వేగంతో వెళ్లినట్లు సమాచారం. ఘటనాస్థలం వద్ద ప్రయాణికుల ఆర్తనాదాలతో భీతావహ వాతావరణం నెలకొంది.



## ఎల్లయ్యగౌడ్ కుటుంబంలో
# తీవ్ర విషాదం

**ముగ్గురు అక్కాచెల్లెళ్లు ప్రమాదంలో దుర్మరణం**

**రంగారెడ్డి, నవంబర్ 3 :** రంగారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో అంతులేని విషాదం నింపింది. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఎల్లయ్య గౌడ్ ముగ్గురు కుమార్తెలు ఈ ప్రమాదంలో మృతిచెందారు. అక్కాచెల్లెళ్లు తనూష, సాయి ప్రియ, నందిని మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లోని కోఠి మహిళా కళాశాలలో చదువుతున్న ముగ్గురూ.. గత నెల 15న జరిగిన ఓ పెళ్లివేడుకలో సందడిగా గడిపారు. తల్లిదండ్రులతో పాటు బంధువులు ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఎల్లయ్యగౌడ్ డ్రైవర్‌గా పనిచేస్తూ పిల్లల్ని చదివించారు. ఆయనకు నలుగురు కుమార్తెలు. ఒక కుమార్తెకు వివాహం కాగా.. మిగిలిన ముగ్గురు కుమార్తెలు సోమరవాం జరిగిన రోడ్డు ప్రమాదంలో విగత జీవులుగా మారడంతో ఆ కుటుంబం, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. మరోవైపు యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన అఖిలరెడ్డి అనే యువతి కూడా ఇదే ప్రమాదంలో చనిపోయారు. ఎంబీఏ చదువుతున్న కుమార్తె మృతితో అఖిల తల్లి, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఘటనా స్థలానికి వచ్చి బోరున విలపించారు.

## అంతా క్షణాల్లో జరిగిపోయింది

**బస్సు ప్రమాద ఘటనపై కండక్టర్ రాధ**

**రంగారెడ్డి, నవంబరు 3 :** చేవెళ్ల సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం అనేక కుటుంబాలను శోకసంద్రంలో ముంచేసింది. ప్రమాదంలో ప్రాణాలతో బయటపడ్డ బస్సు కండక్టర్ రాధ ఆ భయానక ఘటనను కన్నీళ్లతో గుర్తుచేసుకున్నారు. కండక్టర్ రాధ మాట్లాడుతూ.. అంతా క్షణాల్లో జరిగిపోయిందన్నారు. టిప్పర్ చాలా వేగంగా వస్తున్నదని నేను, మా డ్రైవర్ గమనించాము. డ్రైవర్ బస్సును కిందకు తిప్పే ప్రయత్నం చేశాడు.. అలా చేయకపోయి ఉంటే ఇంకా ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయేవారని చెప్పారు. చిట్టేపల్లి దగ్గర ఒక మహిళ బస్సులో ఎక్కింది. వికారాబాద్ దగ్గర ముగ్గురు పోలీసులు ఎక్కారు, తరువాత వారు దిగిపోయారు. అందరూ సంతోషంగా తమ పనులకెళ్లడానికి బయల్దేరారు. ఒక్క క్షణంలోనే అంతా చిద్రం అయిపోయింది. ఆ తర్వాత ఏమైందో గుర్తులేదని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు లోపల కలిగిన పరిస్థితులను రాధ వర్ణిస్తూ.. డ్రైవర్ వెనుక కూర్చున్న వాళ్లపై చాలా కంకరాళ్లు పడ్డాయి. నేను పక్కకు పడిపోయాను. ఓ వ్యక్తి నన్ను లాగి కాపాడాడు. తల నుంచి రక్తం కారుతుండడంతో నా చున్నీతో నేనే కట్టుకున్నానని వివరించారు. డ్రైవర్ దస్తగిరి చాలా మంచివాడు. డ్రైవింగ్‌లో ఎప్పుడూ జాగ్రత్తగా ఉండేవాడు. నన్ను అక్కా అని పిలిచేవాడు. ఇవాళ మధ్యాహ్నం రమ్మని అడిగితే 'రాలేను అక్కా' అన్నాడు. అంతలోనే ఇంత పెద్ద విషాదం జరగడం చాలా బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే వెనుక వస్తున్న వాహనాలు, జేసీబీ బృందాలు సహాయ చర్యల్లో పాల్గొన్నాయని, బస్సు, టిప్పర్ వాహనాలను పక్కకు తొలగించి గాయపడిన వారిని బయటకు తీయడం జరిగినట్లు రాధ వివరించారు.

## తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు

**రంగారెడ్డి, నవంబరు 3 :** చేవెళ్ల సమీపంలో 19 మందిని కబళించిన రోడ్డు ప్రమాదం..పలు కుటుంబాలను చిన్నాభిన్నం చేసింది. ఇద్దరు చిన్నారులకు తల్లిద్రండులను దూరం చేసి అనాథలుగా మార్చింది. ఈ ప్రమాదంలో వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం హాజీపూర్‌కు చెందిన భార్యాభర్తలు బండప్ప, లక్ష్మి మృతి చెందారు. దీంతో వారి కుమార్తెలు భవాని, శివలీల ఒంటరిగా మిగిలిపోయారు. తల్లిదండ్రుల మృతితో చిన్నారులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ప్రమాదంలో ఓ బాలుడి తల్లి చనిపోగా తండ్రికి గాయాలయ్యాయి. బాలుడు ప్రాణాలతో బయటపడ్డాడు. గచ్చిబౌలిలో చదువుకుంటున్న ఓ యువతి ప్రమాదంలో చనిపోవడంతో వారి కుటుంబసభ్యులు బోరున విలపించారు. ఆదివారం సెలవు కావడంతో ఇంటికి వచ్చిందని.. తిరిగి వెళ్లేటప్పుడు ఈ ప్రమాదం జరిగిందని కన్నీరుమున్నీరయ్యారు.

# ఆదిలాబాద్ విమనాశ్రయంలో పురోగతి

**700 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం ఆదేశం**



**హైదరాబాద్, నవంబరు 3 :** ఆదిలాబాద్‌లో విమానాశ్రయం కోసం భూసేకరణకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. ఎయిర్ పోర్టు కోసం భూసేకరణ చేయాలని ఆదేశించింది. ఆదిలాబాద్‌లో 700 ఎకరాలు సేకరించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ప్రభుత్వం ఆమోదించింది. కేంద్రవిమానయాన సంస్థ కూడా మొగ్గుచూపింది. రాష్ట్రంలోని వరంగల్, ఆదిలాబాద్‌లలో బ్రౌన్‌ఫీల్డ్ విమానాశ్రయాలను రానున్న రెండేళ్లలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. భూసేకరణకు సంబంధించిన అన్ని ప్రక్రియలు పూర్తి కాగానే పనులు ప్రారంభించడానికి ఏఏఐ సిద్ధమవుతోంది. ఇప్పటికే వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయ అభివృద్ధికి కావాల్సిన భూసేకరణ పూర్తి కావొచ్చింది. ఇక్కడ అవసరమైన 253 ఎకరాల భూసేకరణకు రూ.205 కోట్లను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఆదిలాబాద్‌లోనూ బ్రౌన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి భారత వాయుసేన అంగీకారం తెలుపడంతో ఏఏఐ రాబోయే రెండేళ్లలో ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయడానికి సిద్ధమవుతోంది. ఈ రెండు విమానాశ్రయాలను 2027 జూన్ నాటికి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కాగా, స్థానిక పరిస్థితులను బట్టి 2027 డిసెంబరులోగా అందుబాటు లోకి తెస్తామని కేంద్రం గతంలో తెలిపినట్లు సమాచారం. ఈ రెండు విమానాశ్రాయాలకు అనుమతులు ఇచ్చామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కూడా తెలిపారు. దీంతో వేగంగా అడుగులు పడనున్నాయి. ఇది పూర్తయితే మహారాష్ట్ర ప్రజలకు కూడా అందుబాటులోకి రాగలదు.

## మెడికల్ పిజి విద్యలో
# 85శాతం లోకల్ విద్యార్థులకే

**జీవోలు విడుదల చేసిన ప్రభుత్వం**

**హైదరాబాద్, నవంబరు 3 :** రాష్ట్రంలో మెడికల్ పీజీ విద్య యాజమాన్య కోటాలో 85 శాతం సీట్లు ఇక తెలంగాణ విద్యార్థులకే దక్కనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నాడు రెండు జీవోలు జారీ చేసింది. ఈ జీవో కారణంగా ఈ ఏడాది రాష్ట్ర విద్యార్థులకు అదనంగా 318 మెడికల్ పీజీ, 70 డెంటల్ పీజీ సీట్లు దక్కనున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ పీజీ వైద్య కాలేజీల్లో 50 శాతం సీట్లను అఖిల భారత కోటాలో, మిగతా 50 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో స్థానికులతో భర్తీ చేస్తున్నారు. తెలంగాణలో ఉన్న 19 ప్రైవేటు పీజీ మెడికల్ కాలేజీల్లో 1511 వరకు సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో సగం సీట్లను కన్వీనర్ కోటా కింద స్థానికులకు కేటాయిస్తున్నారు. మిగతా సీట్లను ఎంక్యూ1, ఎంక్యూ2 (ఎన్ఆర్ఐ), ఎంక్యూ3(ఇన్‌స్టిట్యూషనల్) కోటా కింద భర్తీ చేస్తారు. వీటిలో ఎంక్యూ 1 కింద 25 శాతం సీట్లు ఉండగా.. వీటన్నింటిని ఆలిండియా కోటాకే కేటాయించేవారు. అయితే ఎంక్యూ1లోని 85 శాతం సీట్లను స్థానికులతోనే భర్తీ చేయాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది.

## మంగోలియాలో ల్యాండ్ అయిన
# ఎయిరిండియా విమానం

**న్యూఢిల్లీ, నవంబరు 3 :** శాన్ ఫ్రాన్సిస్కో నుండి ఢిల్లీకి వస్తున్న ఎయిర్ ఇండియా విమానం ఆదివారం మంగోలియాలోని ఉలాన్‌బాటర్‌లో ముందస్తు జాగ్రత్త చర్యగా ల్యాండింగ్ చేసిందని ఎయిర్‌లైన్ ఒక ప్రకటనలో తెలిపింది. కోల్‌కతా మీదుగా నడుస్తున్న ఈ విమానం ఉలాన్‌బాతర్‌లో సురక్షితంగా ల్యాండ్ అయింది. ప్రస్తుతం, సాంకేతిక తనిఖీలు జరుగుతున్నట్లు ఎయిర్ ఇండియా తెలిపింది. ప్రయాణికులకు సాయం చేయడానికి మేము మా భాగస్వాములతో కలిసి పనిచేస్తున్నాం. వీలైనంత త్వరగా అందరిని గమ్యస్థానానికి చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాము. ఉహించని పరిస్థితి కారణంగా ప్రయాణికులకు కలిగిన అంతరాయానికి చింతిస్తు?న్నాము. ఎయిర్ ఇండియా ప్రయాణికులు, సిబ్బంది భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎయిర్ లైన్ ప్రతినిధి అన్నారు. దీనికి ముందు జెడ్డా నుంచి హైదరాబాద్ వస్తున్న ఇండిగో విమానానికి బెదిరింపులు రావడంతో శనివారం ముంబైకి మళ్లించారు. తనిఖీలు జరిగిన తర్వాత తప్పుడు బెదిరింపులుగా అధికారులు తేల్చారు.

# జూబ్లీహిల్స్ గెలుపోటములతో ఒరిగేదేమిటి?




**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఇప్పుడు మూడు పార్టీలకు సవాల్‌గా మారింది. ఈ రాష్ట్రంలో రెండు పార్టీల పాలన ముచ్చటను ప్రజలు చూశారు. ఇక బిజెపి పాలన ఎలా ఉంటుందో పెద్దగా చెప్పనక్కరలేదు. అయినా జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఎవరు గెలిచినా పెద్దగా పొడిచేదేమీ లేదు. కాకపోతే రాజకీయ పార్టీలు ఈ ఎన్నికను సవాల్‌గా తీసుకుంటున్నాయి. దీంతో ఇక్కడ పోటీ ప్రతిష్టాతకంగా మారింది. గెలవాలని కాంగ్రెస్, మళ్లీ గెలవాలని బిఆర్ఎస్, గెలిస్తే సత్తా చాటొచ్చని బిజెపిలు తహతహలాడుతున్నాయి. ఈ ఉప ఎన్నిక ఫలితం తో ప్రజల జీవితాల్లో పెద్దగా మార్పు ఉండదు. అలాగే రాజకీయంగా కూడా పెద్దగా వచ్చే మార్పుల ఏవీ ఉండకపోవచ్చు.**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఇచ్చే తీర్పు మీద యావత్ తెలంగాణ రకరకాలుగా విశ్లేషణలు చేయడానికి ఉపయోగపడుతుంది. ఫలితం తరవాత ఎవరి విశ్లేషణలు వారికి ఉంటాయి. ముఖ్యంగా బిఆర్ఎస్ పదేండ్ల పాలనకు, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న రెండేండ్ల కాంగ్రెస్ పాలనకు మధ్య తేడాను విశ్లేషించే అవకాశం వస్తుంది. అలాగే జూబ్లీహిల్స్ ఓటర్లు విజ్ఞత ప్రదర్శించినా ఈ ముగ్గురిలో ఎవరో ఒకరికి ఓటేయక తప్పదు. తెలంగాణ సమాజం కూడా ఈ ఉప ఎన్ని ఫలితంలో ఏదో జుగుతుందని ఆశించడం లేదు. ఇది కేవలం రాజకీయ పార్టీలు తమ బలాబలాలను విశ్లేషించుకోవడానికి, పరస్పరం దుమ్మెత్తి పోసుకోవడానికి పనికివస్తుంది. ఈ ఉప ఎన్నిక కేవలం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి మాత్రమే పరిమితమైన ఎన్నికగా గుర్తించాలి.. మొత్తం తెలంగాణ రాజకీయాలను మలుపుతిప్పే ఎన్నిక అస్సలు కాదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ రెండేండ్ల పాలన మీద జూబ్లీహిల్స్ ప్రజల తీర్పు ఉండబోతుందన్న వాదనల్లో నిజం కడా లేదు. ఎందుకంటే అక్కడున్న మూడు పార్టీల్లో ఒకరిని గెలపించక తప్పదు. ప్రభుత్వ విధానాన్ని తెలియజెప్పే ఎన్నికగా అస్సలు చూడడానికి లేదు. పేద, ధనిక, మధ్య తరగతి ప్రజలు ప్రభుత్వం మీద ఆగ్రహం ఉంటేగింటే రోడ్ల మీదికి వచ్చి నిరసన తెలియజేయడం చూస్తున్నాం. అలా నిరసనలు తెలియ చేస్తున్న వారికి ఈ ఎన్నికల్లో ఓటేసే వారికి మధ్య సారూప్యం ఉండదు.

ఉపఎన్నికలు లేదా ఇతర ఎన్నికల్లో తమ ఓటు ద్వారా ఒక బలమైన సందేశం ఇచ్చే అవకాశం అన్నది గతం. ఇప్పుడు ప్రజలు కూడా మారారు. ఎవరు డబ్బులు ఇస్తే వారికి ఓటేస్తున్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనకు, రెండేండ్ల కాంగ్రెస్ పాలనకు మధ్య ఉన్న తేడా ఏమిటనే దానిమీద ఈ ఉప ఎన్నిక ఫలితాన్ని చూపి నిర్ణయించలేదం. తెలంగాణ రాజకీయాలపై ఇప్పటికే ప్రజల్లో ఆసక్తికరమైన చర్చ కొనసాగుతున్నది. కాంగ్రెస్ అయినా, బిజెపి అయినా ప్రజల్ల గణనీయమైన మార్పులు తెచ్చే అవకాశాలు కనిపించడం లేదు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయింది. దుబరా ఖర్చులతో రాష్ట్రాన్ని దివాలా తీయించారు. అనేక పథకాలతో డబ్బుల పందేరం చేశారు. సంక్షేమం, వ్యవసాయం, విద్యుత్తు సహా అన్ని రంగాల్లో పంపకాల మీద కేసీఆర్ ప్రత్యేక దృష్టిసారించారు. తన పాలన కాలంలో తెలంగాణను పూర్తిగా దోపిడీ చేసయడంపైనే ఫోకస్ చేశారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను గుదిబండగా మార్చారు. డబ్బుల సకాలంలో చెల్లించకపోవ డంతో ఇప్పుడు వారు ఆందోళనకు దిగారు. కాళేశ్వరం, పాలమూరు, సీతారామ వంటి అనేక సాగునీటి ప్రాజెక్టులను నిర్మించి కంట్రాక్టర్లకు దోఇపెట్టారు. తద్వారా సొంత లాభం చూసుకున్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, గురుకుల విద్యాలయాలు, కేసీఆర్ కిట్, బతుకమ్మ చీరలు, గొర్రెలు, చేప పిల్లల పంపిణీ వంటి పథకాలు దుబరా పథకాలుగా, దోపిడీ పథకాలుగా నిలిచాయి. ఇక ఇవన్నీ గమనించే ప్రజలు బిఆర్ఎస్‌ను దూరం పెట్టారు. కాంగ్రెస్ వచ్చి కూడా పెద్దగా ఒరగబెట్టిందేమీ లేదు. ఆరు గ్యారెంటీల పేరుతో అలవికాని హామీలివ్వడంతో గత ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు కూడా పెద్దగా ప్రజల జీవితాలను మార్చలేకపోతున్నాయి.

అప్పనంగా దోచిపెట్టే నగదు బదిలీ పథకాలతో ఓట్ల వేటలో పడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ పేరుతో కాలయాపన చేస్తోంది. కాంగ్రెస్, బిఆర్ఎస్ ఇద్దిర పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గురుకుల విద్యాలయాల నిర్వహణలో ఘోర వైఫల్యాలను చూస్తున్నాం. కాంగ్రెస్ హయాంలో ఆర్థిక శాఖలో బిల్లుల మంజూరు విషయంలో పర్సంటేజీల గురించి కథలు కథలుగా చెప్పుకునే పరిస్థితి వచ్చింది. ఇక కాంగ్రెస్ అభ్యర్థి నేపథ్యం గురించి పలు విమర్శలు ప్రచారంలో ఉన్నయి. బీజేపీ అభ్యర్థి పోటీలో ఉన్నా వారు గెలిచి చేసేదేమీ లేదు. ప్రధానంగా ఈ రెండేండ్ల కాంగ్రెస్ పాలన చూసిన తర్వాత, అద్భుతంగా నడుస్తున్న కేసీఆర్ పాలనను దూరం చేసుకున్నామనే భావన తెలంగాణ ప్రజల్లో కలుగుతున్నదని, అందువల్ల తమకే మళ్లీ ఓటాయని బిఆర్ఎస్ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. అయితే జూబ్లీహిల్స్ ఓటర్లు ఇంకా చైతన్యాన్ని ప్రదర్శించి ఓటేయాల్సి ఉంది. ఎవరికి వేసినా ముగ్గురు మాత్రమే కనిపిస్తున్నారు. ఈ మూడు పార్టీలు చెల్లని పార్టీలని తేలిపోయింది. అందువల్ల ఇక్కడ ఎవరు గెలిచినా, ఆయా పార్టీలకు తప్ప ప్రజలకు లాభం లేదు.

# కాశీబుగ్గ ఘటనలో బాధ్యులు ఎవరు

- ప్రభుత్వం ఎందుకు ఉదాసీనంగా ఉంది
- ముందే పోలీసులు ఎందుకు రాలేదు
- ప్రజల్లో ఇప్పుడు ఇదే చర్చ



**శ్రీకాకుళం, నవంబర్ 3 :** శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వరాలయం ఘటనలో నేరం నిర్వాహకు లపై తోసేసి చేతులు దులుపుకున్న యంత్రాంగం తీరు సరికాదు. సాధారణంగా జన సమూహాలు పోగయ్యేచోట ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతుంది. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వ చర్యలకి ఎన్నోసార్లు ఎంతోమంది ఇబ్బందులు పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇక ఆలయాల్లో జరిగే విశేష క్రతువులప్పుడు పాలకుల ఆదేశాలతో అధికారులు తమ సిబ్బందిని సమాయత్తం చేయడం కనిపిస్తుంది. కనీ ఇక్కడ అలాంటిదేమీ జరగలేదు. అది ప్రైవేటు వ్యక్తులు నిర్వహించే ఆలయం. కార్యక్రమం గురించి మాకు ముందస్తు సమాచారం ఇవ్వలేదు. కాబట్టే ఈ ప్రమాదం జరిగిందని చేతులు దులుపుకోవడం ప్రజా సంరక్షణ పట్ల పాలకుల చిత్తశుద్ధికి అద్దం పడుతోంది. తిరుపతి ఘటన మరువక ముందే తాజాగా శ్రీకాకుళం లోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో దారుణం జరిగింది. మృతులంతా మహిళలు, పిల్లలు, వృద్ధులు. నిర్వాహకుల అలసత్వం, ప్రభుత్వ వైఫల్యం ఈ ఘటనలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. 2 ఎకరాల సొంత భూమిలో హరిముకుంద్ పండా ఈ ఆలయాన్ని ప్రారంభించారు. 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.20 కోట్ల వ్యయంతో ఆలయాన్ని నిర్మించారు. ఈ ఏడాది మే నుండే ఇక్కడ దర్శనాలు మొదలయ్యాయి. ఇంత తక్కువ సమయంలోనే ఆలయానికి ఇంత జనం పోటెత్తడానికి కారణమేంటి? 2 నుండి 3 వేల లోపు భక్తులకి మాత్రమే అవకాశమున్న ఆలయానికి 15 వేలకి మించి జనాలు ఎలా వచ్చారన్నది ముఖ్యం. శనివారం కార్తీక ఏకదాశి పర్వదినాన వేంకటేశ్వరున్ని దర్శించుకుంటే మీకు?' అంటూ సోషల్ మీడియాలో విపరీత ప్రచారం చేశారు. ఆలయ నిర్మాణం గురించి గతంలో అనేకసార్లు విశేషంగా ప్రస్తావించారు. దీంతో స్వల్ప కాలంలోనే ఈ ఆలయం చిన్న తిరుపతిగా ప్రసిద్ధిలోకి వచ్చింది. ఇప్పుడు 'పవిత్ర దినం' అన్న ముద్ర అదనంగా తోడైంది. ఫలితంగా చుట్టుపక్కల గ్రామాల నుండి మహిళలు, పిల్లలు, వృద్ధులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఇంత విస్తృతంగా ప్రచారం చేసిన ఆలయ నిర్వాహకులు అందుకు తగిన స్థాయిలో పటిష్ట భద్రత ఏర్పాటు చేయలేదు. కనీసం ప్రైవేటు వాలంటీర్లతో రక్షణ చర్యలు కూడా చేపట్టలేదు. చివరకు పోలీసులకు కూడా సమాచారం ఇవ్వలేదు. దీంతో తొక్కిసలాట జరిగి 9మంది మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదం దానంతట అదే వచ్చిపడింది కాదు. నిర్వాహకులు, యంత్రాంగ లోపం ప్రధానంగా కనిపిస్తున్నాయి. వేకువజాము నుండే భక్తుల తాకిడి ఎక్కువైంది. అప్పటి వరకు సందడిసందడిగా ఉన్న ఆలయ ప్రాంగణంలో ఒక్కసారిగా సంభవించిన అనుకోని ప్రమాదంతో భీకర ఆర్తనాదాలు చుట్టుముట్టాయి. ఏడుపులు, పెడబొబ్బలతో జనాలు పరుగులు పెట్టారు. అయినవారి ఆచూకి కానరాక, ఊపిరాడని ఆ గుంపులోనే తమవాళ్లని వెతుక్కున్నారు చాలామం ది. ఏం జరిగిందో అర్థంకాని అయోమయంలో అరుస్తూ, ఏడుస్తూ బయటికి పరుగెత్తారు అనేకమంది. పూలసజ్జలు, ఆరతి పళ్లేలు, పూజాద్రవ్యాలు ఎక్కడపడితే అక్కడ చిందరవందరంగా పడిఉన్నాయి. రెప్పపాటు కాలంలో అంతా అయిపోయింది. అభంశుభం తెలియని అమాయకులు, పిల్లల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. దీనికి ఎవరు సమాధానం చెబుతారన్నది కావాలి.

## 'ఫ్యామిలీ బిజినెస్'గా భారత రాజకీయాలు : శశిథరూర్



**న్యూఢిల్లీ:** సీనియర్ కాంగ్రెస్ నాయకుడు , తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ భారత రాజకీయలపై కీలక వ వ్యాఖ్యలు చేశారు.'భారత రాజకీయాలు ఒక కుటుంబ వ్యాపారం' అనే వ్యాసంలో వంశపార్యంపర్యంగా వస్తున్న రాజకీయ అధికారం, నాయకత్వ సంస్కృతిపై కొన్ని ప్రశ్నలను లేవనెత్తారు. అంతేకాదు ఈ ధోరణి భారత ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పును కలిగిస్తుందన్నారు. కాంగ్రెస్ నేతగా కాంగ్రెస్ పై స్పష్టమైన విమర్శలు చేయడం చర్చకు దారి తీసింది. దశాబ్దాలుగా, ఒకే కుటుంబం భారత రాజకీయాలపై ఆధిపత్యం చెలాయించింది అంటూ కాంగ్రెస్ వారసత్వం రాజకీయాలపై విమర్శలనెక్కుపెట్టారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటం చరిత్రలో గొప్ప ప్రభావం ఉన్నప్పటికీ స్వతంత్ర భారతదేశ తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, ప్రధాన మంత్రులు ఇందిరా గాంధీ .రాజీవ్ గాంధీ, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ,ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రాలతో సహా నెహ్రూ-గాంధీ వంశానికి జన్మతః హక్కుగా ఉండిపోయింది. క్రమంగా ఈ ఆలోచన ప్రతి పార్టీలోనూ, ప్రతి ప్రాంతంలోనూ, ప్రతి స్థాయిలోనూ భారత రాజకీయాల్లోకి చొచ్చుకుపోయిందంటూ వ్యాఖ్యానించారు. 'భారత రాజకీయాలు కుటుంబ వ్యాపారంగా మారాయి, ఇక్కడ నాయకత్వం జన్మతః హక్కుగా పరిగణించబడుతోంది' అని అభిప్రాయపడిన శశిథరూర్ వంశపారంపర్యంగా సంక్రమించే రాజకీయ అధికారం పాలన , జవాబుదారీతనాన్ని దెబ్బతీస్తుందని వాదించారు. ఎందుకంటే ఈ విధంగా ఎంపికైన నాయకులు తరచుగా ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సవాళ్ల నుండి డిస్‌కనెక్ట్ చేయబడతారని విమర్శించారు. మమతా బెనర్జీ ,,మాయావతి వంటి ప్రత్యక్ష వారసులు లేని మహిళా రాజకీయ నాయకులు కూడా మేనల్లుళ్లను తమ వారసులుగా ఎంచుకున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్ట్ సిండికేట్‌లో ప్రచురించిన ఈ వ్యాసంలో శశిథరూర్, భారతీయ రాజకీయ రంగంలో రాజకీయ నాయకత్వం జన్మతః హక్కు అనే ఆలోచన స్థిరపడిపోయిందని, ఇది గ్రామ సభల నుండి పార్లమెంటు అత్యున్నత స్థాయి వరకు భారత పాలనలో ఇదే ధోరణి లోతుగా అల్లుకుపోయిందన్నారు. కానీ రాజకీయ వారసులే పాలనకు సరిపోతారనే విశ్వాంస పాతుకుపోయిందనీ. దీని పాలన నాణ్యత తప్పనిసరిగా దెబ్బతింటుందని థరూర్ రాసుకొచ్చారు. భారతదేశం రాజవంశాన్ని మెరిటోక్రసీగా మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. దీనికి ప్రాథమిక సంస్కరణలు అవసరం, చట్టబద్ధంగా తప్పనిసరి చేసిన పదవీకాల పరిమితులను విధించడం మొదలు, అర్థవంతమైన అంతర్గత పార్టీ ఎన్నికలు దాకా మెరిట్ ఆధారంగా నాయకులను ఎన్నుకునేలా ఓటర్లకు అవగాహన కల్పించడానికి, అధికారం ఇవ్వడానికి సమిష్టి కృషి కావాలన్నారు. భారత రాజకీయాలు కుటుంబ సంస్థగా ఉన్నంత కాలం, 'ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకొనే' అనే నిజమైన ప్రజాస్వామ్య కల పూర్తిగా సాకారం కాబోదని ఆయన చెప్పారు. కాగా సీనియర్ కాంగ్రెస్ నేతగా ఆయన ప్రత్యక్షంగా కాంగ్రెస్ పార్టీపైనే తన విమర్శలను ఎక్కుపెట్టడం చర్చకు దారి తీసింది. అయితే కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి గతంలో ఆయన గతంలో పోటీని దృష్టిలో ఉంచుకునే ఈ వ్యాఖ్యలు చేసినట్టు రాజకీయ నిపుణులు భావిస్తున్నారు.

## గంజాయి ముఠా పట్టివేత

### ద్విచక్రవాహనాలు తనిఖీలో పట్టుబడ్డ ముఠా

**మహబూబ్‌నగర్, నవంబర్ 3 :** దాడులు చేస్తున్నా గంజాయి తరలింపు ఆగడం లేదు. వరుసగా పలు జిల్లాల్లో గంజాయి రవాణా సాగుతూనే ఉంది. తాజాగా నారాయణపేట జిల్లాలో అంతరాష్ట్ర గంజాయి ముఠా పట్టుబడింది. ఈ ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నారాయణపేట జిల్లా ఎస్పీ వెల్లడించారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ వినీత్ మీడియాకువివరించారు. కృష్ణ మండల పోలీసులు కున్సి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు ద్విచక్రవాహనాలపై అనుమానాస్పదంగా వెళ్తున్న వారిని తనిఖీ చేశారు. వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని ఇచ్చిన సమాచారంతో కృష్ణ మండలం రైల్వేస్టేషన్‌లో మరో 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి సరఫరా చేస్తున్న వారితో పాటు ఓ మహిళ, మరో తొమ్మిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో గంజాయి విక్రయిస్తున్న వారు, సేవిస్తున్న వారు ఉన్నారన్నారు. వారందరూ తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన వారిగా గుర్తించినట్లు చెప్పారు. ఎక్కడైనా గంజాయి అమ్ముతున్నట్లు, తీసుకున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. గంజాయి వాడినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## లైట్ ఆర్పనందుకు మేనేజర్నే చంపేశాడు

**బెంగళూరు :** మనుషుల్లో అంతకంతకూ వివేచన, విచక్షణ జ్ఞానం అనేది అంతకంతకూ నశించిపోతోంది. స్వల్ప వివాదానికే ఆవేశంతో ఊగిపోతున్నారు. చివరకు హత్యలకు కూడా తెగబడుతున్నారు. తాజాగా బెంగళూరులో జరిగిన ఒక హత్యోందంతం దిగ్భ్రాంతి రేపక మానదు. ఆఫీసులో లైట్లు ఆర్పే విషయంలో ఏర్పడిన చిన్న తగాదా హత్యకు దారి తీసింది. చిత్రదుర్గకు చెందిన భీమేష్ బాబు అనే 41 ఏళ్ల మేనేజర్‌ను అతని సహోద్యోగి డంబెల్‌తో కొట్టి చంపాడు. శనివారం తెల్లవారుజామున గోవిందరాజనగర్ పోలీస్ పరిధిలోని డేటా డిజిటల్ బ్యాంక్ కార్యాలయంలో తెల్లవారుజామున 1.30 గంటల ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. తెల్లవారుజామున 1 గంటల ప్రాంతంలో, విజయవాడకు చెందిన టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ సోమల వంశీ (24)ని లైట్లు ఆర్పేయమని తన మేనేజర్ భీమేష్‌ను కోరాడు. లైట్లు, వెలుగులు పడని వంశీ అవసరం లేనప్పుడు వాటిని ఆఫ్ చేయమని సహోద్యోగులను తరచుగా కోరుతూ ఉంటాడట. అదే విధంగా భీమేష్‌ను కూడా లైటు ఆఫ్ చేయమని కోరాడు. భీమేష్ వినకపోవడంతో అది వాగ్వాదానికి తీసింది. కోపంతో ఊగిపోయిన వంశీ బాబుపై కారం పొడి విసిరి, తల, ముఖం, ఛాతీపై డంబెల్‌తో పదేపదే కొట్టడంతో అతను కుప్పకూలి పోయాడు. ఆ తరువాత వంశీ భయాందోళనకు గురై ఇతర ఉద్యోగుల సహాయం కోరాడు. అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. కానీ బాబు అక్కడికక్కడే మరణించాడు. ఆ తరువాత వంశీ స్వయంగా గోవిందరాజనగర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. హత్య కేసు నమోదు చేయబడింది. ఆఫీసు లైట్లు వెలిగించాలనే వివాదం హత్యకు దారితీసిందని డిసిపి (వెస్ట్) గిరీష్ ఎస్ ధృవీకరించారు.

## విజయ్ కార్యాలయానికి సీబీఐ



**కరూర్, నవంబర్ 3 :** తమిళనాడులోని కరూర్‌లో టీవీకే ప్రచార సభలో చోటుచేసుకున్న తొక్కిసలాట కేసుపై సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం సీబీఐ అధికారులు తమిళగ వెట్రి కళగం ప్రధాన కార్యాలయానికి వెళ్లినట్లు తెలుస్తోంది. తొక్కిసలా ట ఘటన జరిగిన సందర్భంలో పార్టీ ప్రచారానికి హాజరైన నేతలకు సంబంధించిన వివరాలు, కార్యక్రమానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు టీవీకే పార్టీ నేత నిర్మల్ కుమార్ పేర్కొన్నారు. పలువురు నేతలను కూడా వారు విచారించినట్లు సమాచారం. ప్రచార సమయంలో తొక్కిసలాటకు గల కారణాలు తెలుసుకోవడానికి సీబీఐ అధికారు లు అధునాతన 3 లేజర్ స్కానింగ్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరో వైపు ఈ ఘటనపై క్షుణ్ణంగా దర్యాప్తు జరపడానికి దాదాపు 306 మందిని విచారిం చనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకుగాను వారందరికీ సమన్లు జారీ చేశామన్నారు. గత నెల 27న టీవీకే పార్టీ అధ్యక్షుడు, సినీనటుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార సభ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. తొక్కిసలాటలో 41 మంది మృతి చెందగా.. 60 మందికిపైగా గాయపడ్డారు. మద్రాసు హైకోర్టు ఆదేశాల మేరకు ఈ ఘటనపై దర్యాప్తును తొలుత సిట్ చేపట్టింది. దీనిని సవాల్ చేస్తూ... టీవీకే సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సిట్‌పై తమకు నమ్మకంలేదని, ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరింది. పిటిషన్‌పై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం దర్యాప్తు బాధ్యతను సీబీఐకి మారుస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ప్రస్తుతం ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు బాధిత కుటుంబాలు, ప్రత్యక్ష సాక్షులతోపాటు స్థానికుల నుంచి వాంగ్మూలాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

## దర్శన్, పవిత్రపై నేరాభియోగాలు



**బెంగళూరు, నవంబర్ 3 : :** తన అభిమాని రేణుకాస్వామి హత్య కేసులో కన్నడ నటుడు దర్శన్, ఆయన స్నేహితురాలిపై అభియోగాలు నమోదయ్యాయి. మొత్తం 17 మంది నిందితులపై బెంగళూరులోని సెషన్స్ కోర్టు నేరాభియోగాలు నమోదు చేసింది. తాము ఏ తప్పూ చేయలేదని వారంతా న్యాయస్థానం ముందు వెల్లడించారు. ఈ కేసు విచారణలో భాగంగా కోర్టు గది నిండిపోవడంపై న్యాయమూర్తి అసహనం వ్యక్తంచేశారు. ఈ కేసుతో సంబంధంలేని న్యాయవాదులు బయటకు వెళ్లిపోవాలని ఆదేశించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే విచారణ వాయిదా పడుతుందని హెచ్చరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం తదుపరి విచారణను కోర్టు నవంబర్ 10కి వాయిదా వేశారు. అనంతరం దర్శన్, పవిత్ర, ఇతర నిందితులను జైలుకు తరలించారు. దర్శన్ దాదాపు 20 ఏళ్ల క్రితమే విజయలక్ష్మిని వివాహం చేసుకున్నారు. కొన్నేళ్లుగా పవిత్ర గౌడతో కలిసి ఉంటున్నారని, ఆ సంబంధం వల్ల విజయలక్ష్మికి అన్యాయం జరుగుతుందన్న బాధతో రేణుకాస్వామి అనే యువకుడు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పవిత్రను లక్ష్యంగా చేసుకుని అశ్లీల సందేశాలు, దర్శన్‌ను విడిచిపెట్టాలని హెచ్చరికలు చేస్తూ వచ్చాడని దర్యాప్తులో పోలీసులు గుర్తించారు.

## తుపాకీతో కాల్చుకొని కానిస్టేబుల్ ఆత్మహత్య



**సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా మహబూబ్ సాగర్ చెరువు కట్ట వద్ద సందీప్ అనే కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. తుపాకీతో కాల్చుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. నారాయణఖేడ్ నియోజకవర్గం కల్హేర్‌కి చెందిన ఆయన వ్యక్తిగత కారణాలతోనే బలవన్మరణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. సంగారెడ్డి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతికి గల కారణాలపై విచారణ చేపట్టనున్నట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు.



## క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడుతాయి

### మండల విద్యాధికారి చలపతిరావు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** క్రీడలు మానసిక ఉల్లాసం,ఉత్సాహంతో పాటు శారీరక,మానసిక దృఢత్వానికి దోహదపడుతాయని నేలకొండపల్లి మండల విద్యాధికారి చలపతిరావు అన్నారు.మండలంలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ లో సోమ వారం మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీడీఓ ఎర్రయ్య,తహసిల్దార్ వెంకటేశ్వర్లు తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల స్నేహభావం,నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చని తెలిపారు.క్రీడల్లో గెలుపు,ఓటములు సహజమని ఓటమి రేపటి విజయానికి నాంది అని ఎంపీడీఓ ఎర్రయ్య తెలియజేశారు.ప్రతి ఒక్కరూ గెలవాలనే తలంపుతో క్రీడల్లో పాల్గొనాలన్నారు. నేటి యువత గంజాయి,నార్కోటిక్ డ్రగ్స్ వంటి మత్తు పదార్ధాలకు, జూదానికి దూరంగా ఉంటూ సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. మండలంలోని 18 పాఠశాలలు ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు.రెండు రోజుల పాటు జరుగనున్న ఈ క్రీడల్లో విద్యార్థులకి భోజన సదుపాయం కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,పిడి ఉజ్వల,అన్నపూర్ణ,రమాదేవి,రామకృష్ణ,గోపి,ప్రశాంత్,క్రాంతి తదితరులు పాల్గొన్నారు



## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యాన్ని తేవాలని తద్వారా కనీస మద్దతు ధర లభిస్తుందని కూసుమంచి తహసిల్దార్ రవి కుమార్ అన్నారు.కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో సోమవారం ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఓ వాణితో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటను దళారీకి అమ్మి మోసపోకుండా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని రైతులకు సూచించారు.ఏ గ్రేడ్ ధాన్యానికి మద్దతు ధర 2389 రూపాయలు,కామన్ గ్రేడ్ కి 2369 రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయించి కొనుగోళ్లు చేపడుతున్నట్లు వెల్లడించారు.మద్దతు ధర కోసం ధాన్యాన్ని తేమ లేకుండా తీసుకురావాలని కోరారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం రాయల శ్రీనివాస రావు,సీసీ,శ్రీ వెంకటేశ్వర గ్రామ సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు,వివోఏ,రైతులు,తదితరులు పాల్గొన్నారు.



## బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

### బీసీ జేఏసి వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్

**ములుగు, రాజముద్ర న్యూస్ :** బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని,బీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అంబేద్కర్ విగ్రహం వద్ద నవంబర్ 6న బీసీ జేఏసీ ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మౌన దీక్ష నిర్వహించటం జరుగుతుందని,బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్ అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ..బీసీల 42 శాతం హక్కు కోసం వివిధ మండలలు, గ్రామాల నుండి బీసీ ప్రజలు ప్రతి ఒక్కరు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షులు ముంజాల బిక్షపతి గౌడ్, మల్లంపల్లి మండల సాధన సమితివ్యవస్థాపక కు అధ్యక్షులు గోల్కొండ రాజు యాదవ్, సంఘం జిల్లా నాయకులు సంపత్ తదితరులు పాల్గొన్నారు.





## కన్నతల్లిని కడతేర్చిన కసాయి కొడుకు

### పింఛన్ పైసలు ఇవ్వకపోవడంతో గొడ్డలికర్రతో దాడి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** కడుపున పుట్టిన కన్న కొడుకే తల్లిని కడతేర్చిన సంఘటన తిరుమలాయపాలెం మండలంలోని కాకరవాయి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది.స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకరవాయి గ్రామానికి చెందిన మందుల బూబ(50) భర్త కొన్నేళ్ల క్రితం మరణించడంతో కుమారుడు మధు వద్ద నివసిస్తుంది.మధ్యానికి బానిసైన మధు మద్యం సేవించడానికి తల్లి బూబ వద్ద ఉన్న పించన్ పైసలు ఇవ్వాలని అడుగగా ఆమె నిరాకరించింది.అప్పటికే మద్యం మత్తులో ఉన్న మధు ఆవేశంతో గొడ్డలి కర్రతో తల్లి బూబ తలపై విచక్షణా రహితంగా దాడి చేయడంతో ఆమె కొట్టుమిట్టాడుతూ అపస్మారక స్థితిలోకి వెళ్లింది. అనంతరం మధు తల్లి బూబని అక్కడే వదిలేసి మద్యం మత్తులో ఇంట్లోకి వెళ్లి నిద్రలోకి జారుకున్నాడు. సోమవారం ఉదయం లేచి చూడగానే ఆమె మరణించింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై కూచిపూడి జగదీష్ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.ఇదిలా ఉండగా మధుకి గతంలో ఓ యువతితో వివాహాం జరుగగా ఇద్దరు పిల్లలు జన్మించారు.తాగుడికి బానిసై భార్యను వేధింపులకు గురి చేస్తూండడంతో ఆమె కొన్నేళ్ల క్రితం వదిలేసిన వెళ్ళిపోయింది.

## మణిముఖర గోల్డ్ షాప్‌ని ప్రారంభించిన కొప్పుల వేణారెడ్డి

### జ్యోతి ప్రజ్వలన చేసిన సినీ నటి, జబర్దస్త్ ఫేమ్ అనసూయ



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేటలో మణిముఖర జ్యువెలర్స్‌ను ప్రారంభించిన మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి రెడ్డి, సినీనటి అనసూయ జ్యోతి ప్రజ్వలన చేశారు.పెద్ద ఎత్తున తరలివచ్చిన అభిమానులు షాప్‌లోని నగలను పరిశీలించిన అనసూయ అనంతరం మీడియాతో మాట్లాడారు నాణ్యమైన ఆభరణాలు వినియోగదారులకు అందించి వారి మనసులను గెలుచుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. నమ్మకంతోనే వ్యాపారాలు ముందుకు సాగుతాయని అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో రాష్ట్ర రాజధానిని తలదన్నేలా కార్పొరేట్ స్థాయిలో జ్యువెలర్స్ షాప్‌ను ఏర్పాటు చేసిన తెడ్ల కిషోర్,ఉమ మహేశ్వరి,వారి కుమారుడు సాయి కిరణ్, చాందినీని,సుహాస్,సంతోషి లను ఆమె అభినందించారు.ఈ సందర్బంగా వేణారెడ్డి మాట్లాడుతు గత 13 సంవత్సరాలుగా సాయి సంతోషి జ్యువెలర్స్ ద్వారా వినియోగదారుల మనసులు గెలుచుకున్న వారు, నూతనంగా ప్రారంభించిన మణిముఖర జ్యువెలర్స్ తో తమ వ్యాపార పరంపరను కొనసాగించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నామని తెలిపారు. ఇట్టి కార్యక్రమం లో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్,జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్,పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చింతమళ్ళ రమేష్, చివ్వేంల మండల పార్టీ అధ్యక్షులు దారావత్ వీరన్న,జ్యువెలరీ అసోసియేషన్ అధ్యక్షులు అంతటి విజయ్,కోశాధికారి బుర్లే మధు, ముప్పారపు బాబురావు, ముప్పారపు నాగేశ్వర్ రావు, రాచర్ల కమలాకర్,చల్లా లక్ష్మి కాంత్, చల్లా లక్ష్మిప్రసాద్,గుండా శ్రీధర్, బ్రహ్మ దేవర సోమయ్య,కక్కిరేణి ప్రసాద్,మరియు పట్టణ ప్రముఖులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియచేశారు

## నూతన గృహప్రవేశానికి హాజరైన మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి

### చిన్నారులను ఆశీర్వదించి బొకే అందజేసిన మాజీ మేయర్



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** పీర్జాదిగూడ నగర పరిధిలోని 5వ డివిజన్ బిపిఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీ యందు జరిగిన గుత్తి మంజుల, వెంకట రమణ నూతన గృహ ప్రవేశం, శారీ, దోతీ వేడుకలలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ 5వ డివిజన్ అధ్యక్షులు మునికుంట్ల కిరణ్ గౌడ్, కాలనీ అధ్యక్షులు మునికుంట్ల నరేష్ గౌడ్, జనరల్ సెక్రటరీ రావు నాగిరెడ్డి, కోశాధికారి మునికుంట్ల ప్రదీప్ గౌడ్, పలువురు కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు, మహిళలు హాజరై శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## చేవెళ్ల రోడ్డు ప్రమాదానికి బిఆర్ఎస్, కాంగ్రెస్‌లదే బాధ్యత


- చనిపోయిన వారి కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి
- సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్ :** నిన్న చేవెళ్ల మండల పరిధిలోని మిర్జాగూడ గేటు వద్ద జరిగిన ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి విచారం వ్యక్తం చేస్తూ బాధితులను పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ....ఈ ప్రమాదానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఈ ప్రాంత మాజీ మంత్రులు, ఎంపీల నిర్లక్ష్యం కారణంగా అప్పా జంక్షన్ నుండి మన్నెగూడ వరకు రోడ్డు విస్తరణ పనులు జరగలేదని అన్నారు. 2018లో గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు వేస్తే అంతకన్నా ముందు ఈ ప్రాంతం నుంచి మంత్రిగా బాధ్యతలు వహించిన సబితా ఇంద్రారెడ్డి తీవ్ర నిర్లక్ష్యం వల్ల రోడ్డు విస్తరణ పనులు జరగలేదన్నారు. హైదరాబాద్ చుట్టూ ఉన్నటువంటి జాతీయ రహదారులన్నీ విస్తరణ జరిగాయని, హైదరాబాద్ కు ఆనుకొని ఉన్న బీజాపూర్ జాతీయ రహదారి మాత్రమే విస్తరణకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం బిజెపి ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి బీజాపూర్ జాతీయ రహదారి పనులకు 2017 లోనే అనుమతి తీసుకు వచ్చానని చెప్పారని, ఎందుకు రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయాయని ప్రశ్నించారు. ఇప్పుడు కేంద్రంలో ఉన్నది బీజేపీ ప్రభుత్వమే అని ఎన్జీటిలో కేస్ వికెట్ చేయించి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం చేసే బాధ్యత ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి పైన ఉందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ, టిప్పర్ యాజమాన్యంతో మాట్లాడి నష్టపరిహారం వచ్చే విధంగా ప్రభుత్వం చూడాలని అన్నారు. ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లల సంరక్షణ బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులను పరామర్శించిన వారిలో సిపిఎం రాష్ట్ర నాయకులు డి జి నరసింహారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, పిడిఎస్యు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ భారీ బహిరంగ సమావేశం కోసం సన్నాహక సమావేశం

### కామారెడ్డిలో పాత్రికేయ సమావేశంలో విశారదన్ చిరంజీవులు సాధన సమితి నాయకులు



**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** సోమవారం రోజున కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీసీ 42% రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో చిరంజీవి మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం అత్యధిక జనాభా ఉన్న బీసీ ప్రజలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలనీ అది కేవలం పార్లమెంటులో 9వ షెడ్యూల్లో చేస్తూ చట్టం చేస్తే తప్ప అమలుకు నోచుకోదని చెప్పారు. పాలకులు వారి పబ్బం కడుపుకోవడం కోసం అది ఏ పార్టీ అయినా సరే ప్రస్తుతం ఉన్న అన్ని రాజకీయ పార్టీలు పార్టీలలో ఉన్న బీసీ నాయకులు ఆయా పార్టీలోనే ఉంటూ ఈ బిల్లు పార్లమెంట్లో చట్టబద్ధత పొందెంతవరకు తమతో కలిసి రావాలని అయితే వారి రాజకీయ పార్టీ జెండాను పక్కనపెట్టి సమావేశంలో పాల్గొనవలసి ఉంటుందని మాట్లాడారు. బీసీ ప్రజలు ఇక కల్లబొల్లి కబురులు నమ్మే పరిస్థితుల్లో లేరని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే శీతాకాల పార్లమెంట్ సమావేశాలలో బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టి 9వ షెడ్యూల్ చేరుస్తూ చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అందుకే ఈ జిల్లాల పర్యటనలో ప్రజలను జాగతం చేయడమే ప్రజలను జాగృతం చేస్తూ ఒక మహా బారి బహిరంగ సభ నిర్వహిస్తామని తద్వారా ఢిల్లీకి వినిపించేట్టుగా చేస్తామని హెచ్చరించారు. డాక్టర్ విశారదన్ సర్ మాట్లాడుతూ రాజులు పోయాయి రాజ్యాలు పోయాయి అయినప్పటికీ ప్రజాస్వామ్యంలో ఉంటూ గుప్పెడు మందికి 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ గుడ్డు చప్పుడు కాకుండా నిర్ణయం చేసినటువంటి పాలకులు గంపెడు మంది ఉన్న ఈ బీసీ 42 శాతం రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్లో పెట్టకుండా చట్టబద్ధత కల్పించకుండా ఒకరి మీద ఒకరు నెట్టు వేసుకుంటూ రాజకీయాలు చేయడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని విరుచుకుపడ్డారు. కామారెడ్డిలో మొదలైనటువంటి ఈ ఉద్యమం 33 జిల్లాల్లో తిరుగుతూ ప్రజలకు వివరిస్తూ చివరి సమావేశం జింఖానా గ్రౌండ్లో లక్షలాది మందితో నిర్వహిస్తామని తద్వారా శబ్దం ఢిల్లీకి చేరేలా చేసి ఈ నలభై రెండు శాతం బిల్లును షెడ్యూల్లో చేర్పించి బీసీ ఎస్సీ ఎస్టీల కలయికతో ఇది సాధించి తీరుతామని బీసీల కల నెరవేరుస్తామని చెప్పారు. తద్వారా రాజ్యాధికారం సాధించడమే చివరి లక్ష్యమని వివరిస్తూ ఈనెల 15వ తారీఖున జరగబోయే భారీ బహిరంగ సభకు బీసీ ప్రజలు ఎస్సీ ఎస్టీ ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, ఉమ్మడి జిల్లా నాయకులు, అంబాల నారా గౌడ్, అరవింద్, రీజనల్ నాయకులు, అడ్వకేట్ సిద్ధ రాములు, డాక్టర్ రమేష్ బాబు మిగతా కార్యకర్తలు పాల్గొన్నారు.



## రైతులందరికీ యూరియా అందుబాటులో ఉండే విధంగా ప్రణాళికలు

### రైతులకు యూరియా తగిన మోతాదులో అందుబాటులో ఉండేలా ఎరువుల శాఖ సమయోచిత ప్రణాళికతో చర్యలు

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** భారత ప్రభుత్వ ఎరువుల శాఖ దేశవ్యాప్తంగా రైతులకు అవసరమైన ఎరువులు, ముఖ్యంగా యూరియా, ఖరీఫ్ 2025 సీజన్‌లో తగిన మోతాదులో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం భారత రైల్వేలు, పోర్టులు, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎరువుల తయారీ కంపెనీలు వంటి విభిన్న భాగస్వామ్య సంస్థలతో సమన్వయం కల్పించి సమయానుకూల ప్రణాళిక రూపొందించింది. వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ అంచనా వేసిన 185.39 లక్ష మెట్రిక్ టన్నుల అవసరానికి ఎదురుగా, ఎరువుల శాఖ 230.53 లక్ష మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచింది. ఇది 193.20 లక్ష మెట్రిక్ టన్నుల అమ్మకాల కంటే ఎక్కువగా ఉంది. దీని ద్వారా దేశవ్యాప్తంగా యూరియా సరఫరా తగినంతగా ఉందని స్పష్టమవుతోంది. అలాగే, మంచి వర్షాకాలం కారణంగా పంటల విస్తీర్ణం పెరగడం వల్ల రైతులు కరిఫ్ 2024తో పోలిస్తే సుమారు 4.08 లక్ష మెట్రిక్ టన్నుల యూరియాను అధికంగా వినియోగించినట్లు గణాంకాలు చూపుతున్నాయి. ఇది రైతులకు తగిన యూరియా అందుబాటులో ఉందని, పంట ఉత్పత్తి పెరుగుదలకు సహాయపడిందని సూచిస్తోంది.



## జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేయండి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే డి సుధీర్ రెడ్డి

- ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, పలువురు నేతలు

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో భాగంగా మాగంటి సునీత గోపినాథ్ గెలుపే లక్ష్యంగా మాజీమంత్రి మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, ఎల్ బి నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏదవల్లి రఘువర్ధన్ రెడ్డి, కిరణ్ నాయక్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ, ఇంటింటి ప్రచారంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ప్రజలందరూ బిఆర్ఎస్ వైపే ఉన్నారని గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను తెలంగాణ ప్రజలందరూ గమనిస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ మళ్లీ ప్రభుత్వాన్ని చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంటింటి ప్రచారంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## బస్సు టిప్పర్ యాక్సిడెంట్‌లో చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలి

### క్షతగాత్రులను పరామర్శించినా సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** సోమవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని మిర్జాగూడ సమీపంలో జరిగిన రోడ్డు యాక్సిడెంట్ ను బట్టి వికారాబాద్ జిల్లా సిపిఎం పార్టీ కార్యదర్శి ఆర్ మహిపాల్ వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరిశీలించారు. అనంతరం ఆర్ మైపాల్, ఎంఐఎం జిల్లా కార్యదర్శులు ఆలిమోదిన్, ఎండీ హాలీభూ భూరాన్, ఆర్టీసీ యూనియన్ నాయకులు ఆర్టీసీ బస్సు కంకర లోడుతో వెళుతున్న టిప్పర్ ఢీకొట్టడం ద్వారా ఈ సంఘటనలో చనిపోయిన కుటుంబాలకు 20 లక్షల రూపాయలు ఇవ్వాలని, గాయపడిన వారికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మీర్జాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం వరకు 22 మంది మృతిచెందారని తెలిపారు. మృతుల్లో ఆర్టీసీ బస్సు, టిప్పర్ డ్రైవర్లతో పాటు 7 పురుషులు13 మంది మహిళలు, ఓ చిన్నారి మృతి చెందరని పేర్కొన్నారు. వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో 10 మంది చికిత్సా పొందుతున్నారు. అందులో ముగ్గురికి తలకు బలమైన కాలు చేతులకు బలమైనగాయాలు ఉన్న లారీ ఓనర్ లక్ష్మణ్ ను, ఇద్దరు హైదరాబాద్ కు చెందిన మైనారిటీకి కుటుంబం భార్యాభర్తల కళ్లు చేతులు విరిగిపోవడం జరిగిందన్నారు. వారిని హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారిని వికారాబాద్ లో వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న స్థానిక ఆసుపత్రిలో లో కనీస వసతులు వెంటనే కల్పించాలని పేర్కొన్నారు. అప్ప జె%శీ%క్షన్ నుండి రోడ్ విస్తరణ వెంటనే పనులు ప్రారంభించాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నాము అన్నారు. సీఎం , స్పీకర్ జిల్లాలో సరైన రోడ్లు రహదారులు బాగుచెయ్యకపోవడం సిగ్గుచేటని ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు.



# చైనాకు ట్రంప్ వార్నింగ్

## తైవాన్‌పై దాడి చేస్తే పరిణామాలు తీవ్రం

## హెచ్చరికలు చేసిన అమెరికా అధ్యక్షుడు

**యూఎస్ :** అమెరికా–చైనా దేశాల మధ్య ఉద్రిక్తతలు కొద్దిమేర సద్దుమణిగాయని అనుకుంటున్నలోపే.. డొనాల్డ్ ట్రంప్ చైనాకు వార్నింగ్ ఇచ్చారు. తైవాన్‌పై దాడిచేస్తే ఎలాంటి పరిణామాలు ఉంటాయో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో పాటు ఆ దేశ ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు. ఓ మీడియా సంస్థ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. ఇటీవల ఆసియా పర్యటన గురించి మాట్లాడారు. తైవాన్‌పై చైనా మిలిటరీ చర్య తీసుకుంటే అమెరికా సైన్యం పాల్గొంటుందా..? అని ట్రంప్‌నకు ప్రశ్న ఎదురైంది. "ఇక్కడ నేను ఎలాంటి రహస్యాలు చెప్పలేను. అలాంటిది ఏదైనా జరిగితే మీకే ఆ విషయాలు తెలుస్తాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంతకాలం మేం ఏమీ చేయబోమని వారు చెప్పారు. ఎందుకంటే వారికి పరిణామాలు ఎలా ఉంటాయో తెలుసు" అని ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల దక్షిణ కొరియా వేదికగా డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్ మధ్య జరిగిన భేటీ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిన సంగతి తెలిసిందే. దాదాపు రెండు గంటల పాటు అంతర్గతంగా సమావేశమైన వారు పలు కీలక అంశాలపై చర్చలు జరిపారు. జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనాపై టారిఫ్‌లను 10శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. అరుదైన ఖనిజాలకు సంబంధించిన సమస్య కూడా పరిష్కారమైందని చెప్పారు. చైనా నుంచి అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. డ్రాగన్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కూడా కుదరనున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఇలా సానుకూల ప్రకటనలు చేసిన ఆయన ఇప్పుడు వార్నింగ్‌లు ఇవ్వడం గమనార్హం.



# అఫ్గానిస్థాన్‌లో భారీ భూకంపం

**అఫ్గానిస్థాన్ :** అఫ్గానిస్థాన్‌లో భారీ భూకంపం సంభవించింది. సోమవారం తెల్లవారుజామున ఉత్తర అఫ్గాన్ నగరం మజార్–ఎ షరీఫ్ సమీపంలో రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 6.3గా నమోదైంది. ఖుల్మ్ సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ విపత్తు కారణంగా ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. 150 మందికి పైగా గాయపడ్డారని స్థానిక అధికారులు పేర్కొన్నారు. అనేకమంది శిథిలాల్లో చిక్కుకున్నారన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. యూఎస్ జియోలాజికల్ సర్వే వివరాల ప్రకారం.. ఖుల్మ్ సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడైంది. 28 కిలోమీటర్ల లోతులో అది కేంద్రీకృతమై ఉంది. దీంతో సమీప ప్రాంతాల్లో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఘోర విపత్తు కారణంగా మజార్–ఎ షరీఫ్ సహా ఇతర ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు సమాచారం. భూకంపం కారణంగా పలు గ్రామాల్లోని ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయని ఆ దేశ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు వెల్లడించారు. ఈ విపత్తు ధాటికి పలు కుటుంబాలు కకావికలమైనట్లు పేర్కొన్నారు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# 'అనవసర అంశాలపైనే ప్రసంగాలు'..

## ప్రధానిపై ప్రియాంక గాంధీ విసుర్లు



**బిహార్ :** దేశాన్ని, బిహార్‌ను అవమానించారంటూ ప్రతిపక్ష నేతలందరిపై ప్రధాని నరేంద్ర మోదీ ముద్ర వేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ విమర్శించారు. దీనికోసం కేంద్రంలో కొత్తగా 'అవమానాల మంత్రిత్వ శాఖ' ను ఏర్పాటు చేయాలంటూ ఎద్దేవా చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోన్‌బర్సాలో నిర్వహించిన ప్రచార సభలో ఈమేరకు ప్రసంగించారు. ప్రధాని అనవసర విషయాలన్నీ మాట్లాడుతున్నారని, కానీ.. రాష్ట్రంలో ఎన్డీయే సర్కారు అవినీతి, దుష్పరి పాలనపై మాత్రం నోరు మెదపడం లేదన్నారు. "అభివృద్ధి గురించి మాట్లాడటానికి బదులుగా.. ప్రతిపక్ష నేతలు దేశాన్ని, బిహార్‌ను అవమానిస్తున్నారంటూ ప్రధాని మోదీ పదేపదే ఆరోపిస్తున్నా రు. కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారాలపైనే ఎక్కువ దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. కాబట్టి.. దీని కోసం నూతనంగా 'అవమానాల శాఖ'ను ఏర్పాటు చేయాలి" అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో రాష్ట్రానికి వరాలు ప్రకటించే ముందు.. గత 20 ఏళ్లలో ఎన్డీయే సర్కారు ఏం చేసిందో మోదీ, అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిహార్ ప్రభుత్వాన్ని నీతీశ్ కుమార్ నడపడం లేదని.. ప్రధాని, ఇతర వ్యక్తులు దిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా నియంత్రిస్తున్నారని ప్రియాంక పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును లాక్కొనేందుకు చూస్తున్నారని ఆరోపించారు. స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతోనే యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోందన్నారు. ఉపాధి కల్పించే ప్రభుత్వ రంగ సంస్థలను భాజపా సన్నిహిత కార్పొరేట్‌లకు అప్పగించారని ఆరోపించారు. ఇదిలా ఉండగా.. ఛఠ్ పూజ, మహా కుంభమేళాలను ప్రతిపక్ష నేతలు అవమానించారంటూ ప్రధాని మోదీ ఆదివారం ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రియాంక గాంధీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ప్రపంచంలో చాలా దేశాలు అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయి

- ఈ జాబితాలో పాకిస్థాన్ కూడా ఉంది
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్




**యూఎస్ :** ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. పేర్కొన్నారు. సీబీఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలను నిర్వహిస్తున్నాయి. కానీ, వీటి గురించి ఆయా దేశాలు మాట్లాడట్లేదు. మేం అలా కాదు. ఏదైనా బహిరంగంగానే చేస్తాం. దాని గురించి మాట్లాడతాం. ఇన్నాళ్లు ఎన్ని దేశాలు అణు పరీక్షలు చేపట్టినా మేం వాటి జోలికి వెళ్లలేదు. ఇకపై అలా మిగిలిపోవాలనుకోవట్లేదు. ఇతర దేశాల మాదిరిగానే మేమూ ఈ పరీక్షలు నిర్వహిస్తాం" అని ట్రంప్ వెల్లడించారు. రష్యా, చైనా వద్ద చాలా అణ్వాయుధాలు ఉండి ఉంటాయి. మా దగ్గర అంతకంటే ఎక్కువే ఉన్నాయి. మావద్ద ఉన్న అణ్వాయుధాలతో ఈ ప్రపంచం మొత్తాన్ని 150 సార్లు పేల్చేయొచ్చు. కానీ, అణ్వస్త్రాల నిరాయుధీకరణ గురించి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో చర్చించా అని ట్రంప్ తెలిపారు. అమెరికా అణ్వాయుధ పరీక్షలకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమైనట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, ఎప్పుడు, ఎక్కడ ఈ పరీక్షలు నిర్వహించనున్నారన్న విషయాన్ని మాత్రం ట్రంప్ వెల్లడించలేదు. దక్షిణ కొరియాలోని బుసాన్‌లో ఇటీవల చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీకి ముందు 'ట్రూత్ సోషల్'లో దీనిపై పోస్ట్ చేసిన సంగతి తెలిసిందే. "అణ్వాయుధాలకు ఉన్న విధ్వంసకర శక్తి కారణంగా ఆ పరీక్షలు చేయకూడదని గతంలో అధికారంలో ఉన్నప్పుడు నిర్ణయించుకున్నా. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. రష్యా, చైనా సహా ఇతర దేశాలు వేగంగా తమ అణు సామర్థ్యాలను పెంచుకుంటున్నాయి. అణ్వాయుధాల విషయంలో అమెరికా, రష్యా, చైనా ఐదేళ్లలోపు సమాన స్థాయికి చేరుకునే అవకాశముంది. అందుకే మన దేశం మళ్లీ అణ్వాయుధ పరీక్షలు ప్రారంభించాల్సిన సమయం వచ్చింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌కు దీనికి సంబంధించిన ఆదేశాలు జారీ చేశాను" అని ట్రంప్ తెలిపారు.

# చిల్లర దొంగలే..

## రూ.895 కోట్ల నగలు కొట్టేశారు

### పారిస్ ప్రాసిక్యూటర్ వెల్లడి



**పారిస్:** ఫ్రాన్స్ లౌవ్రే మ్యూజియంలో భారీ చోరీ ఘటన తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి తాజాగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇది చిల్లర దొంగల పనేనని పారిస్ ప్రాసిక్యూటర్ వెల్లడించారు. ఈ దోపిడీ కరుడుగట్టిన ముఠాకు చెందిన ప్రొఫెషనల్స్ చేయలేదు. ఇదంతా చిల్లర నేరాలు చేసే క్రిమినల్స్ పనే. ఈ కేసులో ఇప్పటికే నలుగురు అనుమానితుల్లో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి ప్రొఫైళ్లను పరిశీలిస్తే.. వ్యవస్థీకృత ముఠాకు చెందిన గ్యాంగ్‌స్టర్లుగా అనిపించట్లేదు. శివారు ప్రాంతాల్లో చిన్న చిన్న నేరాలు చేసినట్లు వారిపై అభియోగాలున్నాయి. వీరంతా స్థానికులే అని పారిస్ ప్రాసిక్యూటర్ లారే బెకువా వెల్లడించారు. అరెస్టయిన వారిలో ఓ అమ్మాయి కూడా ఉన్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న మరో అనుమానితుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు ఫ్రాన్స్ హోం మంత్రి లారెన్ నిజ్ తెలిపారు. దోపిడీకి ప్రధాన సూత్రధారి ఆ అనుమానితుడే అయి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. చోరీ అనంతరం దుండగులు ఓ వజ్రాల కిరీటాన్ని పడేసుకుని వెళ్లిపోయారు. దొంగతనానికి ఉపయోగించిన కొన్ని పరికరాలు, గ్లౌజులను కూడా వదిలేసి పరారయ్యారు. ఇవన్నీ చూస్తుంటే ఇది వ్యవస్థీకృత ముఠా చేసిన పనిగా అనిపించట్లేదని అధికారులు ప్రాథమికంగా నిర్ధరించారు. ఈ దోపిడీలో తమ హస్తం ఉందని అరెస్టయిన వారిలో ఇద్దరు అనుమానితులు అంగీకరించినట్లు సమాచారం. అక్టోబరు 19న పారిస్‌లోని లౌవ్రే మ్యూజియంలో చోరీ జరిగింది. మ్యూజియంలో ఓ వైపు నిర్మాణం జరుగుతుండగా.. అక్కడి నుంచి దుండగులు లోపలికి చొరబడ్డారు. అనంతరం సరకు రవాణా చేసే ఎలివేటర్‌లో అపోలో గ్యాలరీలోకి ప్రవేశించారు. నెపోలియన్ కాలం నాటి వస్తువులు, ఆభరణాలు ఉన్న గ్యాలరీ అద్దాలను పగలగొట్టి అందులోని తొమ్మిది వస్తువులను దొంగలించారు. వీరు వెళ్తుండగా.. అందులోని ఓ ఆభరణం మ్యూజియం బయట పడిపోయింది. మిగతా ఆభరణాల విలువ 88 మిలియన్ యూరోలు (భారత కరెన్సీలో దాదాపు రూ.895 కోట్లు) ఉంటుందని అధికారులు అంచనా వేశారు. తొలుత ఈ చోరీని కరుడు గట్టిన దొంగల ముఠా పింక్ పాంథర్స్ గ్యాంగ్ చేసినట్లు అనుమానాలు వ్యక్తమైనా.. అందుకు సంబంధించిన ఆధారాలేవీ లభించలేదు.

# రాజస్థాన్‌లో డంపర్ ట్రక్ బీభత్సం..

## 12 మంది దుర్మరణం, 50 మందికి తీవ్రగాయాలు



**జైపూర్:** రాజస్థాన్‌లో మరో ఘోర ప్రమాదం జరిగింది. సోమవారం రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ప్రయాణిస్తున్న వాహనాలపై డంపర్ ట్రక్ దూసుకెళ్లింది. ఐదుకిలోమీటర్ల మేర వాహనాలను ఢీకొట్టుకుంటూ వెళ్లింది. ఈ ప్రమాదంలో 12మంది మృతి చెందారు. యాభై మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఘోర ప్రమాదం జరిగింది. మద్యం మత్తులో ఉన్న ఓ డంపర్ ట్రక్కు డ్రైవర్ జైపూర్‌లోని లోహమండి రోడ్డుపై ఐదు కిలోమీటర్ల మేర బీభత్సం సృష్టించాడు. మద్యం మత్తులో రోడ్డుపై పలు వాహనా లను ఢీకొట్టడంతో 12మంది మృతి చెందగా..50మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్నట్లు పోలీ సులు పేర్కొన్నారు. మద్యం మత్తులో నియంత్రణ కోల్పోయిన ట్రక్కు డ్రైవర్ దాదాపు ఐదు కిలోమీటర్ల మేర అనేక వాహనా లను ఢీకొంటూ వెళ్లినట్లు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకు న్న భద్రతా బలగాలు, పోలీసు బలగాలు సహాయక చర్యలు చేపట్టాయి. రోడ్డుపై వాహనాల శిథిలాల కింద అనేకమంది చిక్కుకున్నారని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని.. కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

# బార్క్ నకిలీ శాస్త్రవేత్తపై లోతైన విచారణ

- కీలక అంశాలు రాబట్టిన అధికారులు
- సమాచారాన్ని చేరవేసి బాగా సంపాదించిన దుడగుడు

**న్యూఢిల్లీ, నవంబర్ 3 :** ప్రస్తుతం దేశవ్యాప్తంగా కలకలం రేకెత్తిస్తున్న బార్క్ నకిలీ శాస్త్రవేత్త కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. బార్క్ శాస్త్రవేత్తనని చెప్పుకుంటున్న నిందితుడు అక్తర్ కుతుబుద్దీన్ హుస్సైన్‌ను ఇటీవల ముంబై పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. నిందితుడిది ఝార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్ అని పోలీసులు గుర్తించారు. అతడి సోదరుడు అదిల్‌ను ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు. హుస్సైన్ సోదరులకు 1995 నుంచే అనుమానాస్పద రీతిలో వివిధ మార్గాల్లో నిధులు అందాయని ముంబై క్రైం బ్రాంచ్ పోలీసులు గుర్తించినట్టు తెలుస్తోంది. మొదట్లో లక్షల్లో చెల్లింపులు జరిగాయని, ఆ తరువాత ఇవి కోట్లకు చేరుకున్నాయని కూడా గుర్తించారు. భారత న్యూక్లియర్ వ్యవస్థలకు సంబంధించి సీక్రెట్ సమాచారం చేరవేసినందుకు నిందితులు ఈ డబ్బులు పుచ్చుకున్నట్టు అనుమానిస్తున్నారు. అక్తర్‌కు చెందిన ఓ ప్రైవేటు బ్యాంకు అకౌంట్‌లో అనేక అనుమానాస్పద లావాదేవీలు బయటపడ్డాయి. తానో సైంటిస్టు అని చెప్పుకున్నందుకు అతడిని 2004 దుబాయ్‌ను బహిష్కరించినట్టు కూడా వెలుగులోకి వచ్చింది. ఝార్ఖండ్‌లో తనకు తెలిసిన వారి ద్వారా ఆ సోదరులు పలు ఫేక్ ఐడీలను కూడా సమకూర్చుకున్నట్టు తెలిసింది. తమ పేరిట ఉన్న పలు బ్యాంకు అకౌంట్లను కూడా వారు క్లోజ్ చేసినట్టు దర్యాప్తులో తేలింది. ఇద్దరికీ ఐఎస్ఐతో లింకు ఉండొచ్చని కూడా పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులిద్దరూ పాకిస్థాన్‌కు వెళ్లివచ్చినట్టు కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తన ఐడీలు మార్చుకుంటూ అక్తర్ సీక్రెట్ జీవితాన్ని గడుపుతున్నట్టు పోలీసులు గుర్తించారు. వీటి సాయంతోనే విదేశీ పర్యటనలు చేశాడని అనుమానిస్తున్నారు. అరెస్టు సమయంలో అతడి నుంచి స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్స్‌తో పాటు పాత బ్యాంకు అకౌంట్‌ల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. నిందితులకు ఏయే మార్గాల్లో నిధులు వస్తున్నాయో తెలుసుకునేందుకు విస్తృత స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

# భారత్ టెక్ పవర్‌హౌస్‌గా ఎదిగేందుకు ప్రైవేటు పెట్టుబడులు

## ప్రధాని నరేంద్ర మోదీ



**న్యూఢిల్లీ :** భారత్ అత్యంత క్లిష్టమైన, అధిక ప్రభావం చూపే పరిశోధన అభివృద్ధి ప్రాజెక్టులకు మద్దతిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం మరింత అభివృద్ధి చెందడానికి, భారత్ టెక్ పవర్‌హౌస్‌గా ఎదగడానికి ఈ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. న్యూదిల్లీలోని భారత్ మండపంలో రూ.లక్ష కోట్ల పరిశోధనాభివృద్ధి ఫండ్‌ను ప్రారంభిం చిన అనంతరం మోదీ ప్రసంగించారు. దేశంలో ఆధునిక ఆవిష్కరణ లను మరింత పెంచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం భారతదేశ పరిశోధన, అభివృద్ధి వ్యయం రెట్టింపు చేశామ న్నారు. ఈ చర్యలు భవిష్యత్ ఆవిష్కరణలపై తమ నిబద్ధతను తెలియ జేస్తున్నా యన్నారు. విశ్వవిద్యాలయాలలో పరిశోధన, ఆవిష్కరణలను పెంచడా నికి, కొత్త అవకాశాలు సృష్టించడానికి ప్రభుత్వం అనుసంధాన్ రీసెర్చ్ ఫౌం డేషన్‌ను స్థాపించిందని ప్రధాని పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనల్లోనూ భారత్ పురోగతి సాధిస్తోందన్నారు. ఈ రంగంలో అందిస్తున్న సేవలకుగానూ ఇస్రో శాస్త్రవేత్తలను కొనియాడారు. దేశంలో ఆవిష్కరణలు సమగ్రంగా మారినప్పుడు, సాంకేతికత పరివర్తన చెందినప్పుడు గొప్ప విజయాలకు పునాది పడుతుందని మోదీ అన్నారు. ప్రైవేటు రంగాన్ని పరిశోధనల వైపు ప్రోత్సహించేందుకు ప్రస్తుతం రూ.లక్ష కోట్ల పరిశోధనాభివృద్ధి ఫండ్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

# సీఎం మార్పుపై సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు



**బెంగుళూరు :** త్వరలో కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రెండున్నరేళ్ల పదవీకాలం పూర్తికానుండడంతో ఈ విషయంపై ఆయన స్పందిస్తూ.. నాయకత్వ మార్పు గురించి కాంగ్రెస్ హై కమాండ్ ఏమైనా చెప్పిందా అని మీడియాను ప్రశ్నించారు. ఏదోఒకటి చెబుతారని.. వారి మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల కంటే మీడియా ఎక్కువగా ఆసక్తి కనబరుస్తోం దన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలైన మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఈ విషయంపై ఏమైనా చెప్పినప్పుడే దాని గురించి ప్రశ్నించాలని సూచించారు. అయితే బిహార్ ఎన్నికల తర్వాత మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్ గాంధీలతో చర్చించనున్నట్లు సిద్ధరామయ్య తెలిపారు. మరే విషయం గురించీ తనకు తెలియదన్నారు. అయితే బిహార్ ఎన్నికల తర్వాత సీఎం మార్పు గురించి సిద్ధరామయ్య, డీకే శివకుమార్ విడివిడిగా కాంగ్రెస్ అధిష్ఠానంతో చర్చలు జరపనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. నవంబర్ 11న డీకే దిల్లీలో పర్యటించనుండగా..15వ తేదీన సిద్ధరామయ్య కాంగ్రెస్ అగ్రనేతలను కలవనున్నట్లు సమాచారం. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రస్తుతం రెండున్నరేళ్లు పూర్తిచేసుకున్న 50 శాతం మంది మంత్రులను తొలగించి, కొత్తవారికి అవకాశం ఇస్తారని పార్టీ అంతర్గత వర్గాలు పేర్కొంటున్నాయి. కొత్తవారిని క్యాబినెట్‌లోకి తీసుకుంటే.. ఆ వెంటనే సీఎం మార్పుపై హైకమాండ్ నిర్ణయం తీసుకోవడం కష్టతరమవుతుందని భావిస్తున్నాయి. దీనివల్ల పార్టీలో ముఖ్యమంత్రి తన స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు వీలు కలగనుందని చెప్తున్నాయి. కాగా మరోవైపు తనకు సీఎం పదవి చేపట్టాలని ఉందని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పలుమార్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.



# డిజిటల్ అరెస్టులపై కఠినచర్యలు

## సుప్రీంకోర్టు


**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఇటీవలి కాలంలో పెచ్చుమీరుతున్న 'డిజిటల్ అరెస్టు' మోసాలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొంది. డిజిటల్ అరెస్టు స్కామ్‌లపై కొద్దిరోజులుగా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. "ఒక్క మనదేశంలోనే ఈ అరెస్టు బాధితుల నుంచి రూ.3వేల కోట్లు కొల్లగొట్టడం దిగ్భ్రాంతికరం. ఇప్పుడు వీటిని మనం తీవ్రంగా తీసుకోకపోతే.. ఈ నేరగాళ్లు పెచ్చుమీరిపోతారు. వీటికి అడ్డుకట్టవేసేలా కఠినచర్యలు తీసుకోవాలని నిశ్చయించుకున్నాం" అని సుప్రీంకోర్టు పేర్కొంది. "డిజిటల్ అరెస్ట్ సమస్య పెద్దసవాల్‌గా ఉంది. ఇతర దేశాల్లో ఎలాంటి పరిస్థితి ఉందో తెలియదు. సాంకేతిక, ఆర్థిక విభాగాలు ఎలా పనిచేస్తున్నాయో తెలియదు. ఆ విభాగాలు మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది" అని హెచ్చరించింది. ఇలాంటి కేసుల్లో బాధితులు ఎక్కువగా వయోధికులే ఉండటం అత్యంత దయనీయమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయస్థానానికి వెల్లడించారు. అలాగే ఈ కేసుల్లో ఫిర్యాదులపై దర్యాప్తు చేసేందుకు కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక యూనిట్ ఉందని తెలిపిన మెహతా.. ఈ వ్యవహారంలో సమగ్ర దర్యాప్తు వివరాలు దాఖలు చేసేందుకు సమయం కావాలని కోరారు. ఈ మోసాలు దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న నేపథ్యంలో మొత్తం వ్యవహారంపై దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని యోచిస్తున్నట్లు గత విచారణలో సుప్రీంకోర్టు పేర్కొంది. దేశవ్యాప్తంగా విభిన్న రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లను కలిపి విస్తృతస్థాయిలో దర్యాప్తు జరిపే సాంకేతిక, సిబ్బందిపరమైన వనరులు సీబీఐకి ఉన్నాయా? అని కూడా ఆరా తీసింది. ఇందుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమాధానం ఇస్తూ ఇప్పటికే సీబీఐ ఇలాంటి మోసాలపై దర్యాప్తు చేస్తోందని చెప్పారు. కేంద్రహోంశాఖ పరిధిలోని సైబర్ క్రైమ్ డివిజన్ నుంచి ఇందుకు అవసరమైన సాంకేతిక సాయం అందుతున్నట్లు వివరించారు.

# ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రోజంతా లాభనష్టాల ఒడుదొడుకులు ఎదుర్కొని చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. ముఖ్యంగా ప్రైవేట్ బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ స్టాక్స్ సూచీలపై ఒత్తిడి పెంచాయి. ప్రభుత్వరంగ బ్యాంకింగ్ షేర్లు రాణించడం, త్రైమాసిక ఫలితాలు, ఆటోమొబైల్ సేల్స్ డేటా దన్నుగా నిలిచాయి. దీంతో భారీ నష్టాలు తప్పాయి. సెన్సెక్స్ ఉదయం 83,835.10 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,938.71) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 83,609.54 - 84,127.00 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 38.78 పాయింట్ల లాభంతో 83,978.49 వద్ద ముగిసింది. నిఫ్టీ 41.25 పాయింట్ల లాభంతో 25,763.35 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.77గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ ప్యాసింజర్స్ వెహికల్స్, ఎటెర్నల్, ఎస్‌బీఐ, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు ప్రధానంగా లాభాల్లో ముగిశాయి. మారుతీ సుజుకీ, ఐటీసీ, టీసీఎస్, ఎల్అండ్‌టీ, బీఈఎల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.70 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3998 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.





## ఏఐకి సొంత తెలివి తెప్పించేందుకు ప్రయత్నించొద్దు

### మైక్రోసాఫ్ట్ ఏఐ చీఫ్ కీలక వ్యాఖ్యలు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రోజురోజుకూ మరింత స్మార్ట్‌గా మారుతోంది. అడ్వాన్స్‌డ్ ఏఐ మోడళ్లను ఆవిష్కరించేందుకు గూగుల్, ఓపెన్‌ఏఐ, మెటా, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు పోటీపడుతున్నాయి. కోట్లాది రూపాయలు కుమ్మరిస్తున్నాయి. ఇప్పటికే మనుషులు చేసే చాలా పనులను ఏఐ చేయడం ప్రారంభించింది. అయితే, ఇప్పటికీ మనిషిలా ఆలోచించే స్పృహ ఈ ఏఐ మోడళ్లకు లేదు. అయితే, వాటికి కూడా మనిషిలా సొంతంగా ఆలోచించే తెలివితేటలు తీసుకొచ్చేందుకు చేస్తున్న ప్రాజెక్టులపై మైక్రోసాఫ్ట్ ఏఐ సీఈఓ ముస్తఫా సులేమాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అలాంటి ప్రాజెక్టులను ఆపేయాలని సూచించారు. ఈ విషయంలో ఏఐ ఎప్పుడూ మనిషిని చేరుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు సీఎన్‌బీసీ నిర్వహించిన ఆఫ్రోటెక్ సదస్సులో ఆయన మాట్లాడారు. ఏఐకి సొంత తెలివితేటలు అబ్బేలా పరిశోధకులు, డెవలపర్లు చేస్తున్న ప్రయత్నాలను సులేమాన్ తప్పుబట్టారు. మనిషికి మాత్రమే నిజమైన ఎమోషన్లు ఉంటాయని పేర్కొన్నారు. ఈ ప్రయత్నాలు ఫలిస్తాయని తాను అనుకోవడం లేదన్నారు. అసలు ఆ దిశగా అడుగులు వేయడమే తప్పని వ్యాఖ్యానించారు. "ఒక తప్పు ప్రశ్న అడిగితే.. తప్పుడు సమాధానమే వస్తుంది. అంటే ఆ ప్రశ్న అడగడమే తప్పు" అని సులేమాన్ అన్నారు. ఏఐకి సొంతంగా ఆలోచించే ప్రాజెక్టులపై కాకుండా మనిషికి సహాయకారిగా ఉండే కృత్రిమ మేధ ప్రాజెక్టుల పైనే పనిచేయాలని డెవలపర్లకు సూచించారు. ఏఐ ఎంత వేగంగా అభివృద్ధి చెందినా మనిషి భావోద్వేగానికి, ఏఐకి కలిగే స్పందనలకు మధ్య సన్నని గీత ఉంటుందని సులేమాన్ అన్నారు. ఫిజికల్‌గా మనం ఏదైనా బాధ కలిగినప్పుడు మనం చాలా బాధపడతాం. భయపడతాం. ఏఐ విషయంలో ఆ భావోద్వేగం కలగడం అసాధ్యం. ఒకవేళ దానికి అటువంటి భావోద్వేగాలు కలిగించాలని ప్రయత్నించినా.. అది వాస్తవంగా అనుభవించదని పేర్కొన్నారు. ఈతరహా ప్రయత్నాలు చేస్తున్న సంస్థలకు వేర్వేరు లక్ష్యాలు ఉన్నప్పటికీ.. అలాంటి ప్రయత్నాలు చేయకుండా ఉండడమే మంచిదన్నారు. వాస్తవంగా వారికి 'స్పృహ' లేకపోవడం వల్లే ఆ తరహా పరిశోధనలపై సమయం వెచ్చిస్తున్నారని సులేమాన్ తప్పుబట్టారు.



## వన్డే ప్రపంచ కప్ విజేతకు బీసీసీఐ రూ.51 కోట్ల నజరానా

**ముంబాయి :** భారత మహిళా జట్టు విశ్వవిజేతగా నిలిచింది. మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను చిత్తు చేసిన టీమ్‌ఇండియా రూ.39 కోట్ల ప్రైజ్‌మనీని సొంతం చేసుకుంది. 47 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ హర్మన్ సేన ఛాంపియన్‌గా అవతరించింది. మిథాలీరాజ్ నాయకత్వంలో రెండుసార్లు ఫైనల్‌కు వెళ్లినా ఓటమి తప్పలేదు. ఈసారి ఎలాంటి పొరపాటు లేకుండా సఫారీ జట్టును చిత్తు చేసి భారత్ విజేతగా నిలిచింది. ఈ క్రమంలో భారత జట్టుపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. బీసీసీఐ కూడా జట్టుకు భారీ నజరానా ప్రకటించడం విశేషం. ఈ మేరకు బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఓ ప్రకటన విడుదల చేశారు. "బీసీసీఐ కార్యదర్శిగా జైషా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి (2019-24) భారత మహిళా క్రికెట్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వడం మొదలైంది. ఇక ఐసీసీ ఛైర్మన్‌గా జైషా ప్రపంచ కప్ ప్రైజ్‌మనీ విషయంలోనూ ప్రత్యేకంగా నిలిచారు. పురుషుల జట్టు కంటే ఎక్కువ ప్రైజ్‌మనీని అందించారు. ఇప్పుడు ఛాంపియన్‌గా నిలిచిన భారత జట్టుకు బీసీసీఐ నుంచి రూ.51 కోట్ల నజరానా ఇస్తున్నాం. దీన్ని ప్లేయర్లు, కోచ్‌లు, సహాయక సిబ్బందికి అందజేస్తాం. 1983లో కపిల్‌దేవ్ నాయకత్వంలో టీమ్‌ఇండియా తొలిసారి ప్రపంచ కప్‌ను నెగ్గింది. అప్పటి నుంచి దేశంలో క్రికెట్‌కు విపరీతమైన ఆదరణ దక్కింది. ఇప్పుడు అమ్మాయిలు కూడా అద్భుతం చేసి చూపించారు. భవిష్యత్తులో మరింతమంది మహిళలు ఆటను ఎంచుకోవడానికి ఇదొక పునాదిగా మారుతుంది" అని వెల్లడించారు.

# శెభాష్ శ్రీచరణి

## ప్రపంచకప్ విజయంలో శ్రీ చరణిది కీలక పాత్ర

ఐసీసీ మహిళల ప్రపంచకప్-2025 ఛాంపియన్‌గా భారత్ నిలిచిన సంగతి తెలిసిందే. ఆదివారం జరిగిన ఫైనల్లో సౌతాఫ్రికాను ఓడించినన భారత జట్టు.. తమ 47 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. అయితే ఈ చారిత్రత్మక విజయంలో ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాకు చెందిన యువ స్పిన్నర్ నల్లపురెడ్డి శ్రీ చరణిది కీలక పాత్ర. టోర్నీ అసాంతం అద్భుతమైన ప్రదర్శన కనబరిచి భారత్‌కు తొలి వన్డే వరల్డ్‌కప్‌ను అందించింది. ఈ 50 ఓవర్ల ప్రపంచకప్‌లో 9 మ్యాచ్‌లు ఆడిన శ్రీ చరణి 78 ఓవర్లు వేసి 14 వికెట్లు తీసింది. దీప్తీ శర్మ తర్వాత భారత్ తరపున అత్యధిక వికెట్ల తీసిన జాబితాలో చరణి నిలిచింది. దీంతో ఈ కడప అమ్మాయిపై సర్వాత్ర ప్రశంసల వర్షం కురుస్తోంది.



### పల్లెటూర్ నుంచి వరల్డ్ ఛాంపియన్‌గా..

ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా క్రీడా రంగంలో పెద్దగా పేరున్న ప్రాంతం కాదు. కానీ ఈ జిల్లాలోని వీరపునాయిని మండలం ఎర్రమల్లె గ్రామం నుంచి వచ్చిన నల్లపురెడ్డి శ్రీ చరణి.. భారత క్రికెట్ చరిత్రలో తనకంటూ ఒక అధ్యాయాన్ని లిఖించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి పురుషుల లేదా మహిళల క్రికెట్‌లో ప్రపంచ కప్‌లో ఆడిన మొట్టమొదటి క్రీడాకారిణిగా నిలిచింది. కానీ, ఆమె ప్రయాణం అనేక కష్ట నష్టాల మధ్య సాగింది. 21 ఏళ్ల ఈ యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ చిన్నతనంలో ఆమె బ్యాడ్మింటన్, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపింది. అయితే 16 ఏళ్ల వయస్సులో మాత్రమే ఆమె క్రికెట్‌ను సీరియస్‌గా తీసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ నిర్ణయానికి ఆమె మావయ్య కిషోర్ కుమార్ రెడ్డి ప్రధాన కారణం. ఆమె క్రికెట్‌ను ఎంచుకోకపోవడానికి ప్రధాన అడ్డంకులు ఆర్థిక సమస్యలు, కుటుంబం నుంచి మొదట్లో వచ్చిన వ్యతిరేకత. ఆమె తండ్రి చంద్రశేఖర్ రెడ్డి రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో చిన్న ఉద్యోగిగా పనిచేసేవారు. క్రికెట్ జట్టు ఎక్కువగా పురుషుల క్రీడ కావడంతో ఆమె తండ్రి మొదట్లో చరణి నిర్ణయానికి మద్దతు ఇవ్వలేదు. తండ్రిని ఒప్పించడానికి ఆమెకు ఏడాది కాలం పట్టింది. చరణి చెప్పిన ప్రకారం.. ఆమె క్రీడా జీవితాన్ని ప్రారంభించే సమయంలో తన కుటుంబం అప్పులతో బాధపడేది. అయినప్పటికీ ఆ కష్టాలు తన ఆటపై ప్రభావం చూపకుండా ఆమె తల్లిదండ్రులు సహకరించారు. క్రీడా జీవితం ప్రారంభంలో శ్రీ చరణి మొదట ఫాస్ట్ బౌలర్‌గా శిక్షణ పొందింది. ఫాస్ట్ బౌలింగ్‌లో వికెట్లు లభించకపోవడంతో స్పిన్ బౌలింగ్‌ను ప్రయత్నించగా బాగా కలిసి వచ్చింది. ఆ తర్వాత ఆమె నెమ్మదిగా లెఫ్ట్ ఆర్మ్ ఆర్థోడాక్స్ స్పిన్నర్‌గా మారింది. కడప లాంటి మారుమూల ప్రాంతం నుంచి వచ్చి కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ ద్వారా సెలెక్టర్ల దృష్టిలో పడింది. అంతర్జాతీయ క్రికెట్‌కు ఎంపిక కావడం ఆమె అచంచలమైన పట్టుదలకు, కష్టపడే తత్వానికి నిదర్శనం. ఆర్థిక కష్టాలు ఆమె ఆశయాన్ని ఆపలేకపోయాయి.



## టాటా ట్రస్ట్స్ బోర్డు నుంచి తొలగింపు

### సవాల్ చేసిన మెహ్లీ మిస్త్రీ..

**ముంబయి:** టాటా గ్రూప్‌లో అంతర్గత విభేదాలు మరింత ముదురుతున్నట్లే కన్పిస్తోంది. దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటా అత్యంత సన్నిహితుల్లో ఒకరైన మెహ్లీ మిస్త్రీని జీవితకాల ట్రస్టీగా పునర్నియమించేందుకు టాటా ట్రస్ట్స్‌లో ఇటీవల ఆమోదం లభించని సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా ఆయన న్యాయపోరాటం మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. టాటా ట్రస్ట్స్ నిర్ణయాన్ని మెహ్లీ మిస్త్రీ ముంబయి ఛారిటీ కమిషనర్ ఎదుట సవాల్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఆయన కేవియెట్ దాఖలు చేసినట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. టాటా ట్రస్ట్స్‌లోని ట్రస్టీల జాబితాలో మార్పులు ఆమోదించడానికి ముందు తన వాదన వినాలని మెహ్లీ మిస్త్రీ తన పిటిషన్‌లో కోరినట్లు తెలుస్తోంది. ట్రస్టీలందరికీ జీవితకాల నియామకం కల్పించాలని గతేడాది అక్టోబరులో టాటా ట్రస్ట్స్ బోర్డు తీర్మానం ఆమోదించిన విషయాన్ని ఆయన కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. మహారాష్ట్ర పబ్లిక్ ట్రస్ట్స్ చట్టం ప్రకారం.. ఏదైనా ట్రస్ట్‌లు తమ ట్రస్టీల జాబితాలో మార్పులు చేస్తే ఆ వివరాలను 90 రోజుల్లోగా కమిషనర్ ఆఫీసుకు తెలియజేయాల్సి ఉంటుంది. టాటా ట్రస్ట్స్ ఇంకా ఆ వివరాలను వెల్లడించలేదని తెలుస్తోంది. సర్ రతన్ టాటా ట్రస్ట్, సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్, బాయి హీరాబాయి జంషెడ్జీ టాటా నవ్సారి ఛారిటబుల్ ఇన్‌స్టిట్యూషన్‌కు ట్రస్టీగా మెహ్లీ మిస్త్రీని పునర్నియమించే ప్రతిపాదనకు అనుమతిని కోరుతూ ఇతర ట్రస్టీలకు టాటా ట్రస్ట్స్ సీఈఓ ఇటీవల ఒక సర్క్యులర్ పంపారు. ఈ ప్రతిపాదనను ట్రస్టీలు నోయల్ టాటా, వేణు శ్రీనివాసన్, విజయ్ సింగ్ వ్యతిరేకించారు. ట్రస్ట్‌ల్లో మెజార్టీ దక్కకపోవడంతో మెహ్లీ పునర్నియామకానికి ఆమోదం లభించలేదు. మెహ్లీ మిస్త్రీ 2022లో టాటా ట్రస్ట్స్‌కు ట్రస్టీగా నియమితులయ్యారు. ఆయన మూడేళ్ల పదవీకాలం అక్టోబరు 28తో ముగిసింది.

## షెఫాలీ బౌలింగే మాకు సర్‌ప్రైజ్.. మేం సిద్ధం కాలేకపోయాం

### దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా

**ముంబాయి :** వన్డే క్రికెట్‌లో 300 పరుగుల లక్ష్యమంటే ఇప్పుడు మహిళల మ్యాచుల్లోనూ కష్టమేం కాదు. వన్డే ప్రపంచ కప్ సెమీస్‌లోనూ భారత్ ఆసీస్‌పై భారీ టార్గెట్‌ను ఛేదించి గెలిచింది. దీంతో ఫైనల్‌లో దక్షిణాఫ్రికా కూడా ఛేదిస్తుందేమోనని అంతా భావించారు. కానీ, టీమ్‌ఇండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ తీసుకున్న ఓ నిర్ణయమే తమ కొంపముంచిందని దక్షిణాఫ్రికా సారథి లారా వోల్వార్ట్ వెల్లడించింది. తాము అంచనా వేయడంలో విఫలమైనట్లు అంగీకరించింది. ఇంతకీ ఆ నిర్ణయం ఏంటంటే.. షెఫాలీ వర్మను బౌలింగ్‌కు తీసుకురావడమే నని లారా తెలిపింది. "షెఫాలీ బౌలింగ్ ఇలా ఉంటుందని మేం అస్సలు ఊహించలేదు. మాకు అదే సర్‌ప్రైజ్. చాలా నెమ్మదిగా బంతిని సంధించింది. రెండు వికెట్లను కూడా తీసింది. వరల్డ్ కప్ ఫైనల్ వంటి మ్యాచుల్లో పార్ట్ టైం బౌలర్లకు వికెట్లు కోల్పోవడం సరికాదు. కీలక వికెట్లను తీయడంతో మేం తీవ్ర నిరుత్సాహానికి గురయ్యాం. ఆమెకు మరిన్ని వికెట్లు ఇవ్వకూడదని చాలా పొరపాట్లు చేశాం. చాలా అద్భుతంగా బౌలింగ్ చేసింది. మేం ఆమె బౌలింగ్ కోసం అస్సలు సన్నద్ధం కాలేదు. భారత్ తీసుకున్న ఈ నిర్ణయం మమ్మల్ని షాక్‌తోపాటు ఆశ్చర్యానికి గురి చేసింది" అని లారా వెల్లడించింది.



# ఆఫ్ఘనిస్తాన్ క్లీన్ స్వీప్

ఆఫ్ఘనిస్తాన్ జట్టు జింబాబ్వేను వారి సొంత గడ్డపై ఊడ్చేసింది. 3 మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. నిన్న (నవంబర్ 2) జరిగిన నామమాత్రపు మూడో మ్యాచ్‌లో 9 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. ఓపెనర్లు రహ్మానుల్లా గుర్బాజ్ (92), ఇబ్రహీం జద్రాన్ (60) చెలరేగారు. ఆఖర్లో సెదిఖుల్లా అటల్ (35 నాటౌట్) సైతం మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. జింబాబ్వే బౌలర్లలో ఈవాన్స్ 2, నగరవ ఓ వికెట్ పడగొట్టారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే సైతం అద్భుతంగా పోరాడింది. నిర్ణీత ఓవర్లు బ్యాటింగ్ చేసి 201 పరుగులకు ఆలౌటైంది. సికందర్ రజా (51), బ్రియాన్ బెన్నెట్ (47), ర్యాన్ బర్ల్ (37), ముసేకివా (28) పోరాడారు. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లలో అహ్మద్‌జాయ్ 3, ఫజల్ హక్ ఫారూకీ, ఫరీద్ అహ్మద్ మాలిక్ తలో 2, ముజీబ్, నబీ చెరో వికెట్ తీశారు. ఈ సిరీస్‌కు ముందు ఇరు జట్ల మధ్య జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో జింబాబ్వే ఇన్నింగ్స్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.





## భారత్‌తో చివరి రెండు టీ20లకు ట్రావిస్ హెడ్ దూరం

భారత్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లకు ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ దూరమయ్యాడు. నవంబర్ 21 నుంచి ప్రారంభంకానున్న యాషెస్ సిరీస్‌పై దృష్టిపెట్టడానికి హెడ్‌ని టీ20 జట్టు నుంచి విడుదల చేశారు. షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో సౌత్ ఆస్ట్రేలియా తరఫున ఆడాలని అతడిని ఆదేశించారు. హెడ్ స్థానంలో బెన్ డ్వార్షుయిస్‌ని చివరి రెండు టీ20లకు తీసుకున్నారు. నవంబర్ 6న నాలుగో టీ20, 8న ఐదో టీ20 జరగనుంది. తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దవగా.. తర్వాత ఆస్ట్రేలియా, భారత్ చెరో దాంట్లో గెలిచాయి. దీంతో సిరీస్ 1-1తో సమం అయింది.




# విశ్వ విజేతలకు డైమండ్ నెక్లెస్‌లు..

తొలి వన్డే వరల్డ్‌కప్‌ను గెలిచి భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. ఆదివారం జరిగిన ఫైనల్లో 52 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించిన భారత జట్టు.. తమ చిరకాల స్వప్నాన్ని నేరవేర్చుకుంది. అంజుమ్ చోప్రా, జులాన్ గో స్వామి, మిథాలీ రాజ్ వంటి దిగ్గజ కెప్టెన్‌లకు సాధ్యం కాని వరల్డ్‌కప్‌ను హర్మన్ ప్రీత్ కౌర్ భారత్‌కు అందించింది. దీంతో ఉమెన్ ఇన్ బ్లూపై సర్వాత్ర ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో భారత జట్టుకు పారిశ్రామికవేత్త, రాజ్యసభ సభ్యులు గోవింద్ ధోలాకియా ప్రత్యేక బహుమతిని ప్రకటించారు. సూరత్‌కు చెందిన గోవింద్ ధోలాకియా.. హర్మన్ సేనకు వజ్రాభరణాలు(డైమండ్ నెక్లస్), సోలార్ ప్యానెళ్లను గిఫ్ట్‌గా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆదివారం ఫైనల్ మ్యాచ్‌కు ముందు ధోలాకియా బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాకు లేఖ రాశారు. "వన్డే వరల్డ్‌ప్‌లో మన భారత మహిళల జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోంది. ఫైనల్లో కూడా విజయం సాధించి మన అమ్మాయిలు ఛాంపియన్‌గా నిలుస్తారని ఆశిస్తున్నాను. ఒకవేళ భారత్ కప్‌ను గెలుచుకుంటే జట్టులో సభ్యులందరికీ వజ్రాల ఆభరణాలను కానుకగా ఇవ్వాలనుకుంటున్నాను. దీంతో పాటు వారందరి ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నాను" అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఇప్పుడు భారత జట్టు విశ్వ విజేతగా నిలవడంతో ధోలాకియా తన మాటను నిలబెట్టుకోనున్నారు. త్వరలోనే జట్టులోని ప్రతీ ఒక్కరికి తన ప్రకటించిన గిఫ్ట్‌లను ఇవ్వనున్నట్లు ఆయన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. కాగా వరల్డ్ ఛాంపియన్స్‌కు బీసీసీఐ కూడా భారీ నజరానా ప్రకటించింది. భారత జట్టుతో పాటు సహాయక సిబ్బందికి కలిపి రూ. 51 కోట్ల భారీ నగదు బహుమతిని భారత క్రికెట్ బోర్డు ఇవ్వనుంది.



## మనీలాండరింగ్ కేసు..

### అనిల్ అంబానీ ఇల్లు సహా రూ.3 వేల కోట్ల ఆస్తులు అటాచ్

**న్యూఢిల్లీ :** మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటోన్న రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చర్యలు చేపట్టింది. దర్యాప్తులో భాగంగా అనిల్ అంబానీకి సంబంధించిన రూ.3వేల కోట్లకు పైగా విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. ఈ మేరకు ఈడీ అధికారిక వర్గాలు సోమవారం వెల్లడించాయి. అటాచ్ చేసిన ఆస్తుల జాబితాలో ఆయన నివాసంతో పాటు పలు కమర్షియల్ ప్రాపర్టీలు ఉన్నాయి. ముంబయిలోని పాలి హిల్ ప్రాంతంలో గల అనిల్ అంబానీ నివాసం, దిల్లీలోని రిలయన్స్ సెంటర్‌కు చెందిన కొంత భూమిని ఈడీ అటాచ్ చేసింది. వీటితో పాటు దిల్లీ, నోయిడా, గాజియాబాద్, ముంబయి, పుణె, ఠాణె, హైదరాబాద్, చెన్నై, తూర్పుగోదావరిలో అనిల్ అంబానీ కంపెనీలకు చెందిన పలు నివాస, వాణిజ్య ఆస్తులు ఈ జాబితాలో ఉన్నాయి. వీటి మొత్తం విలువ రూ.3,084 కోట్లు అని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. అనిల్ గ్రూప్ కంపెనీలు కోట్ల రూపాయల బ్యాంకు రుణాల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో సీబీఐ దర్యాప్తు చేపట్టింది. కేంద్ర దర్యాప్తు సంస్థ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దీనిపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. రిలయన్స్ ఇన్‌ఫ్రా సహా అనిల్ అంబానీకి చెందిన పలు కంపెనీలు రూ.17,000 కోట్లకు పైగా నిధులను అక్రమంగా తరలించినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది జులైలో రిలయన్స్ గ్రూప్‌లోని 50 కంపెనీలకు చెందిన 35 ప్రాంతాల్లో, 25 మంది వ్యక్తులపై ఈడీ సోదాలు నిర్వహించింది. ఆగస్టులో అనిల్ అంబానీ సహా కంపెనీకి చెందిన పలువురు ఎగ్జిక్యూటివ్ అధికారులను విచారించిన సంగతి తెలిసిందే.





# మనశంకర వరప్రసాద్ బిజీ

సంక్రాంతి బరిలో 'మన శంకరవరప్రసాద్‌గారు'గా సందడి చేయనున్నారు కథానాయకుడు చిరంజీవి. ఈ మూవీ షూటింగ్ శరవవేగంగా సాగుతోంది. ఇప్పటికే చాలా పార్ట్ పూర్తయ్యింది. పాటలు కూడా మంచి రెస్పాన్స్ క్రియేట్ చేస్తున్నాయి. ఆయన టైటిల్ పాత్ర పోషిస్తున్న ఈ సినిమాని అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా ఆదివారం నుంచి హైదరాబాద్‌లో క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్రారంభించుకుంది. చిరుతో పాటు బృందంపై తెరకెక్కిస్తున్న ఈ భారీ పోరాట ఘట్టానికి యాక్షన్ కొరియోగ్రాఫర్ వెంకట్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ ÷-లక్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులకు మరిచిపోలేని అనుభూతిని అందిస్తుందని చిత్ర వర్గాలు తెలిపాయి. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే ఈ ఫ్యామిలీ యాక్షన్ డ్రామాలో హీరో వెంకటేశ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు.



# నా వయసు తగ్గుతుంది..

## బంగారం రేటు పెరుగుతుంది..

బుల్లితెర నుంచి వెండి తెరకు షిఫ్ట్ అయిన హాట్ బ్యూటీ అనసూయ భరద్వాజ్ తన అందచందాలతో నిత్యం సోషల్ మీడియాను వేడెక్కిస్తుంటుంది. హాట్ హాట్ ఫోజులతో కుర్రాళ్ల మతి పోగొడుతుంది. అంతేనా.. తనపై ఎవరైన అసభ్యకరంగా కామెంట్స్ చేస్తే వారిని ఉతికి ఆరేస్తుంది. తాజాగా ఈ రంగమ్మత్త ఆసక్తికర కామెంట్స్ చేసింది. రోజురోజుకీ నా వయసు తగ్గుతుంది.. బంగారం రేటు పెరుగుతుందని హాట్ కామెంట్స్ చేశారు. ఆఫర్లు ఉన్నప్పుడే బంగారం వెనకేసుకోవాలన్నారు. బంగారం అనేది మహిళలకి సౌందర్యంగా.., మగవారికి పొదుపు లాగా ఉంటుందన్నారు. బంగారం తక్కువ రేటు ఉన్నప్పుడే కొనుగోలు చేసి పొదుపు చేసుకోవాలని సూచించారు. మహిళలు క్రికెట్‌లో చరిత్ర సృష్టించి మొదటిసారి భారతదేశానికి వరల్డ్ కప్ తేవడంపై అనసూయ సంతోషంగా వ్యక్తం చేశారు. దేశానికి వరల్డ్ కప్పు రావడం ప్రతి మహిళకు గర్వకారణమన్నారు. విరోచిత పోరాటం చేసి దేశానికి వరల్డ్ కప్పు తెచ్చిన మహిళా క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. అర్జున్ రెడ్డి ఫేమ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగ దర్శకత్వం వహిస్తున్న ప్రభాస్ స్పిరిట్ సినిమాలో తను నటించడం లేదని అనసూయ క్లారిటీ ఇచ్చారు. స్పిరిట్ సినిమాలో నేను నటిస్తున్నానని సోషల్ మీడియాలో వచ్చే వార్తల్లో నిజం లేదని ఆమె తేల్చి చెప్పారు.

# అవార్డుల కన్నా ప్రశంసలే మిన్న

## నటుడు పరేశ్ రావెల్ వెల్లడి






నటీనటులకు అవార్డుల కంటే దర్శకనిర్మాతల ప్రశంసలు గొప్పవని నటుడు పరేశ్ రావల్ చెప్పారు. సినీ పురస్కారాల విషయంలో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన అవార్డుల విషయంలో లాబీయింగ్‌కు ఆస్కారం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇవే పద్ధతులు ఉన్నాయన్నారు. నాకు అవార్డుల గురించి అంతగా తెలియదు. కానీ, నేషనల్ అవార్డుల విషయంలో లాబీయింగ్‌కు ఆస్కారం ఉంటుంది. ఇతర పురస్కారాలతో పోలిస్తే జాతీయ పురస్కారాల విషయంలో లాబీయింగ్ ప్రయత్నాలు ఎక్కువగా ఉంటాయి. ఆస్కార్ అవార్డుల్లోనూ దీనికి ఆస్కారం ఉంది. చిత్రబృందం నెట్‌వర్క్, కొన్ని పార్టీల ద్వారా ప్రయత్నాలు జరుగుతాయి. చిత్రనిర్మాతలు జ్యూరీ సభ్యులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తారు. 'ఇది ఫలనా దర్శకుడి సినిమా' అని ఒక్కోసారి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుంటారు' అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తనకు అవార్డుల కంటే 'నటన బాగుందని' ప్రశంసలు వస్తే ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. బిరుదులు, ట్రోఫీల కంటే దర్శకనిర్మాతల ప్రశంసలే ఎక్కువ విలువైనవని తెలిపారు. ఇక 'వో ఛోకరీ', 'సర్' సినిమాల్లో ఉత్తమ నటనకు గాను పరేశ్ 1994లో ఉత్తమ సహాయనటుడిగా జాతీయ అవార్డు అందుకున్నారు.

# శివలో మోహన్‌బాబును రిజెక్ట్ చేసిన వర్మ



తెలుగు సినిమా చరిత్రను రాయాల్సి వస్తే, శివకు ముందు తర్వాత అంటూ పేర్కొంటారు సినీ విశ్లేషకులు. కేవలం తెలుగు మూవీపైనే కాదు, భారతీయ సినిమాలో ఒక ట్రెండ్‌ను సృష్టించింది. రాంగోపాల్‌వర్మ దర్శకత్వంలో నాగార్జున కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం కల్ట్ మూవీగా బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. అత్యాధునిక హంగులతో, 4కె విజువల్స్‌తో నవంబరు 14న ఈ మూవీ మరోసారి ప్రేక్షకులకు ముందుకు రానున్న సందర్భంగా ఈ ఆసక్తికర విషయాలు మీకోసం.. శివ సినిమాలో నటించిన నాగార్జున, రఘువరన్, అమల ఇలా ఓ నలుగురైదుగురు మినహాయిస్తే, అందరూ కొత్తవారు. ఇందులోని ఓ పాత్ర కోసం విలక్షణ నటుడు మోహన్‌బాబు పేరును చిత్ర బృందం పరిశీలించింది. అటు దర్శకత్వశాఖతో పాటు, ఇతర టెక్నీషియన్స్ కూడా అప్పుడే ఇండస్ట్రీకి వచ్చారు. ఈ సినిమా కథా చర్చలు జరుగుతుండగా, రఘువరన్ దగ్గర రౌడీగా పనిచేసే గణేశ్ పాత్రకు ఎవరిని తీసుకోవాలా?అని చర్చిస్తుండగా, నిర్మాత అక్కినేని వెంకట్ మోహన్‌బాబు పేరును సూచించారు. హీరోకు వార్నింగ్ ఇచ్చే స్థాయి ఉండాలంటే అందరికీ తెలిసిన నటుడు అయితే బాగుంటుందని సలహా ఇచ్చారు. పైగా అప్పటికే ఆయన ప్రతినాయకుడిగా పలు పాత్రల్లో నటించి మెప్పించారు. ఆయనతో తనకున్న పరిచయంతో సులభంగా ఒప్పిస్తానని కూడా చెప్పారు. అయితే, ఇందుకు రాంగోపాల్‌వర్మ ససేమిరా అన్నారు. ఆ పాత్రలో మోహన్‌బాబును పెట్టుకుంటే ఆ సీన్ ఎఫెక్ట్‌వ్‌గా ఉండదని అన్నారట. అందుకు కారణం కూడా వర్మ చెప్పారు. తెలుగు ప్రేక్షకులకు మోహన్‌బాబు సుపరిచితులు. ఆయన నటన, డైలాగ్ డిక్షన్ ప్రత్యేకంగా ఉంటుంది. అలాంటి వ్యక్తి శివ పాత్రకు వార్నింగ్ ఇస్తుంటే, ఆ పాత్రలో ప్రేక్షకుడికి మోహన్‌బాబు కనపడతారు తప్ప, కరుడుగట్టిన రౌడీ కనిపించదని వర్మ అన్నారట. దీంతో ఆ పాత్రలో విశ్వనాథ్ అనే నటుడుని తీసుకున్నారు. ఇక శివలో ఎలాంటి డూప్ లేకుండా నాగార్జున ఒక స్టంట్ చేశారు. లారీని పట్టుకుని సైకిల్‌పై వెళ్లడం. తనని చంపడానికి వచ్చిన రౌడీల నుంచి తప్పించుకునే క్రమంలో పాపను సైకిల్‌పై ఎక్కించుకుని నాగార్జున వెళ్తుంటారు. అప్పట్లో అది అంత డేంజరస్ షాట్ అని వర్మకు అనిపించలేదట.

# మహేశ్‌బాబు యవ్వన రహస్యం ఏమిటో?: రష్మిక

మహేశ్‌బాబు యవ్వన రహస్యం ఏమిటో తెలుసుకోవాలని ఉందని నటి రష్మిక ఆసక్తిని వ్యక్తం చేసింది. రష్మిక కథానాయికగా రూపొందిన తాజా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలు. అల్లు అరవింద్ సమర్పకులు. దీక్షిత్‌శెట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ నవంబరు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రష్మిక సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అభిమానులతో ముచ్చటించారు. వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ప్రస్తుతం పాన్ ఇండియా ఫిల్మ్ చేస్తున్నా. నేరుగా తమిళ మూవీ చేయడానికి కొంత సమయం పడుతుంది. ప్రస్తుతం చాలా వరకూ చర్చల దశలోనే ఉన్నాయి. త్వరలోనే ఇది కార్యరూపం దాల్చుతుందని భావిస్తున్నా. నాకంటూ కొంతమంది బెస్టీస్ ఉన్నారు. పబ్లిక్‌లో వాళ్ల పేరు చెబితే నన్ను చంపేస్తారని అంటూ సరదాగా కామెంట్ చేశారు. మహేశ్‌బాబులో మీకు నచ్చేది ఏదని అడిగితే.. సర్‌కి ఎప్పటికీ వయసు అయిపోవడం లేదు. పైగా నానాటికీ వయసు తగ్గుతోంది. అది నాకు బాగా ఇష్టం. అదెలా సాధ్యమో నాకు తెలుసుకోవాలని ఉందని చిలిపిగా చెప్పింది. ది గర్ల్‌ఫ్రెండ్, థామా వీటిల్లో ఏ సినిమా చేయటం మీకు అత్యంత కష్టంగా అనిపించిందని అడగ్గా ది గర్ల్‌ఫ్రెండ్ మూవీయే అంటూ తెలిపింది.



# నానికి తల్లిగా సోనాలి కులకర్ణి

సోనాలి కులకర్ణికి జాతీయ స్థాయిలో మంచి పేరుంది. మరాఠీ, హిందీ, గుజరాతీ, తమిళ, ఇంగ్లీష్ చిత్రాలలో నటించిన సోనాలీ కులకర్ణి ఏ పాత్ర చేసినా అందులోకి పరకాయ ప్రవేశం చేస్తుంది. నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న ది ప్యారడైజ్ మూవీలో సోనాలి కులకర్ణి కీలక పాత్రను పోషిస్తోంది. నవంబర్ 3 సోనాలి కులకర్ణి పుట్టిన రోజు. ఈ సందర్భంగా ది ప్యారడైజ్ మేకర్స్ ఆమెకు శుభాకాంక్షలు తెలియచేస్తూ ఓ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సినిమా నుండి వచ్చిన రా స్టేట్ మెంట్ గ్లింప్స్ కు సోనాలి కులకర్ణి ఇచ్చిన వాయిస్ నూ ఎవ్వరూ అంత తేలికగా మర్చిపోరు. ఓ పెక్యులర్ మాడ్యుల్ లో సోనాలి కులకర్ణి రా గా చెప్పిన డైలాగ్స్ డైనమేట్ మాదిరి పేలాయి. ఆ గ్లింప్స్ లోని వాయిస్ ను వింటే... నాని తల్లి పాత్రను సోనాలి కులకర్ణి చేస్తోందనే విషయం బోధపడుతుంది. ఇందులో ఆమె పాత్ర కూడా అద్భుతంగా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. చాలామంది సోనాలి కులకర్ణి నటిస్తున్న తొలి తెలుగు సినిమా ది ప్యారడైజ్ అనుకుంటారు కానీ ఆమె చాలా కాలం క్రితమే తెలుగులో మోహన్ కోడా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఎల్లమ్మ అనే చిత్రంలో నటించింది. ఆ సినిమాలో నాజర్, రేవతి కీలక పాత్రలు పోషించారు. ఇక ది ప్యారడైజ్ విషయానికి వస్తే... ఎస్.ఎల్.వి. సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ప్రొడ్యూస్ చేస్తున్న ఈ మూవీలో మరో కీలక పాత్రను విలక్షణ నటుడు మోహన్ బాబు చేస్తున్నాడు. అవినాశ్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్ గా వ్యవహరిస్తున్న ఈ సినిమా వచ్చే యేడాది మార్చి 26న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో విడుదల కానుంది.

# కర్మ ఎవరినీ వదిలిపెట్టదు



టాలీవుడ్ సింగర్‌గా ఫుల్ పాపులారిటీ తెచ్చుకున్న చిన్మయి డబ్బింగ్ ఆర్టిస్ట్‌గానూ చేసింది. సమంతకు డబ్బింగ్ చెప్పిన ఆమె పలు చిత్రాల్లో తన ముద్దు ముద్దు మాటలతో అందరినీ ఆశ్చర్యపరి చింది. తెలుగు, తమిళంలో పలు పాటలు పాడిన చిన్మయి కెరీర్ మంచి ఫామ్‌లో ఉండగానే కోలీవుడ్ నిషేధం విధించింది. మీటూ ఉద్యమం పట్ల చిన్మయి చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపడంతో నిషేధం విధించగా.. గత కొద్ది కాలంగా ప్రొఫెషనల్ లైఫ్‌కు దూరంగా ఉంటుంది. కానీ పర్సనల్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తు న్న చిన్మయి.. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటుంది. ని త్యం పలు వివాదాస్పద పోస్టులతో వార్తల్లో నిలుస్తోంది. తాజాగా, చిన్మయి ఓ ఇద్దరి గురించి సెన్సేషనల్ పోస్ట్ పెట్టింది. ప్రముఖ డ్యాన్స్ కొరియోగ్రాఫర్లు జానీ మాస్టర్, సింగర్ కార్తీక్‌కు అవకాశాలు ఇవ్వడంపై తనదైన స్టైల్లో స్పందించింది. "జానీ మాస్టర్, సింగర్ కార్తీక్ వంటి వాళ్లకు ఇండస్ట్రీలో మరోసారి అవకాశాలు ఇవ్వడం అంటే లైంగిక వేధింపులకు మద్దతు తెలపడమే. డబ్బును అధికారాన్ని దుర్వినియోగం చేసే వారి చేతుల్లో పెట్టొద్దు. మనం నమ్మే కర్మ సిద్ధాంతం నిజమైతే.. కర్మ అసలు ఎవరినీ వదిలిపెట్టదు" అని రాసుకొచ్చింది. కాగా.. ఇటీవల కార్తీక్, జానీ మాస్టర్ లైంగిక ఆరోపణలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com